విశాఖపట్టణం
బుధవారం 27 మే 2026

For a pure tomorrow..

# జయ జయహే

jayajayahey.in  సంపుటి: 9  సంచిక: 123  వెల: రూ.5/-  పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## డేరా బాబాకు మళ్లీ పెరోల్



16వ సారి తాత్కాలికంగా జైలు బయటకు

20 ఏళ్ల జైలు శిక్షలో ఏడాదిన్నర జైలు వెలుపలే

నిబంధనల ప్రకారమే అంటున్న అధికారులు

వరుస పెరోల్ మంజూరుపై విమర్శల వెల్లువ

2




### పట్టాలెక్కనున్న

## దక్షిణ కోస్తా రైల్వే జోన్

జూన్ 1 నుంచీ విశాఖ కేంద్రంగా కార్యకలాపాలు

వివిధ జోన్ల నుంచి తరలి వస్తున్న రైల్వే ఉద్యోగులు

భారీగా ఆదాయం కోల్పోతున్న విశాఖ డివిజన్

సందీప్ మాధుర్ సారధ్యంలో కొత్త రైల్వే జోన్

( ఎం. కే. సునీల్ కుమార్ - జయ జయహే బ్యూరో )

ఏపీ రాష్ట్ర రైల్వే వ్యవస్థను పట్టాలెక్కించేందుకు దక్షిణ కోస్తా రైల్వే జోన్ సర్వ సన్నద్ధమవుతోంది. విశాఖ కేంద్రంగా అయిదారు రోజుల్లో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సర్వ శక్తులా యత్నిస్తోంది. రైల్వే వ్యవస్థ నిర్వహణలో విశాఖకు శతాబ్ద చరిత్ర కలిగినప్పటికీ యావత్ ఏపీ రైల్వేకి విశాఖ కేంద్రంగా జూన్ 1 నుంచీ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. అందుకోసం రైల్వే బోర్డు పూర్తి సమ్మతి తెలియజేస్తే కేంద్రం ఏకంగా గెజిట్ ప్రకటన విడుదల చేసి నూతన జోన్‌కు శ్రీకారం చుట్టింది. దీంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సీనియర్ రైల్వే అధికారులు విశాఖ కేంద్రంగా ఉన్న నూతన రైల్వే జోన్‌కు తరలి వస్తున్నారు. ఇప్పటికే దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే, ఈస్ట్ సెంట్రల్ రైల్వే, ..మిగతా 2లో

# ఫార్మ్ టు హోమ్

వ్యవసాయ ఉత్పత్తులకు కొత్త పాలసీ

మార్కెటింగ్ వ్యూహానికి రూపకల్పన

రైతులకు గిట్టుబాటు ధరల కల్పిస్తాం

ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

వ్యవసాయం, అక్వా, పశుసంవర్థక రంగాలపై సమీక్ష



(అమరావతి - జయజయహే)

వ్యవసాయ అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయం, ఆక్వా, పశుసంవర్ధక రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో 'ఫార్మ్ టూ హోమ్' విధానాన్ని అమలు చేయాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరేలా కొత్త మార్కెటింగ్ వ్యూహాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటూ మధ్యవర్తుల ప్రభావం తగ్గుతుందని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యడవోలు సమీపంలో 'కోకో సిటీ' ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు జులైలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కడప జిల్లా పులివెందులలో నిర్మాణంలో ఉన్న ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసినట్లు సీఎం పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత పరిశీలనకు ఈ ల్యాబ్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఆక్వా రంగానికి ప్రోత్సాహంగా కొత్త ఆక్వా కనెక్షన్లకూ విద్యుత్ సబ్సిడీ వర్తింపజేయనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. అలాగే మత్స్యకారుల సంక్షేమం కోసం 200 మెకనైజ్డ్ బోట్ల కొనుగోలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. రైతులు, మత్స్యకారులు, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# గోదావరి కాలుష్యంపై కన్నెర్ర

ఆంధ్రా పేపర్ మిల్స్ కాలుష్య కారకాలపై ఆగ్రహం

రూ. 13 కోట్ల బకాయిలను ఎందుకు వసూలు చేయలేదు

పరిశ్రమకు నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు

రెండో రోజు పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్ అసహనం

(రాజమహేంద్రవరం - జయజయహే)

గోదావరి నదిలో కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేరుగా రంగంలోకి దిగారు. రెండో రోజు పర్యటనలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆంధ్ర పేపర్ మిల్స్ కాలుష్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఉదయాన్నే వెంకట నగరం ప్రాంతం నుంచి గోదావరి మధ్యన ఉన్న లాగూన్స్ (మడుగులు) వరకు బోటులో వెళ్లి ..మిగతా 2లో



## చనిపోయిన వారిపై నిందలా..?

రాజారెడ్డి, వైఎస్సార్ మహానుభావులు

నిజంగా దుర్మార్గులైతే శిక్షించలేదేం


కూటమి పాలనకు రెండేళ్లైనా ఏం సాధించారు

అందుకే పాత విషాయలను కెలుకుతున్నారు

పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజం

(అమరావతి - జయజయహే)

రాజకీయాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ రాజారెడ్డిల చుట్టూ సాగుతున్న రాజకీయంపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ లోకంలో లేని వ్యక్తులపై, సంజాయిషీ ఇచ్చుకోలేని వారిపై టీడీపీ దుష్ప్రచారం చేయడం వారి రాజకీయ అక్కసును బయటపెడుతోందని ..మిగతా 2లో





## అమ్మో ఒకటో తారీఖు

జూన్ నుంచి ధరల మోత

ఇప్పటికే పెట్రోల్, డీజిల్ బాదుడు

త్వరలో మళ్లీ గ్యాస్ ధరల వాత

రవాణా రంగంపై తీవ్ర ప్రభావం

సామాన్యుడుపై పెను భారం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఇది కేవలం వాహనదారులకు షాక్ మాత్రమే కాదు.. రాబోయే భారీ ఆర్థిక తుపానుకు సంకేతమా? అనే చర్చ మొదలైంది. అమెరికా--ఇరాన్ యుద్ధం, హర్మూజ్ జలసంధి సంక్షోభం కారణంగా. భారతదేశంలో ఇంధన ధరలను పెంచారు. అయితే ఈ పెంపు ప్రభావం ప్రతి ఇంటి బడ్జెట్‌ను కుదిపేసే పరిస్థితి రావొచ్చని ..మిగతా 3లో

## ఎంతటి వారికైనా శిక్ష తప్పదు

3

## అంత డబ్బు ఎలా వచ్చింది..?

చెవిరెడ్డి భార్య, కుమారుడుకు ఈడీ ప్రశ్నలు


లిక్కర్ స్కామ్ విచారణలో నోటీసులు జారీ

ప్రతీ పైసా కష్టపడి సంపాదించామన్న మోహిత్

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన విచారణను తీవ్రతరం చేసింది. ఈ స్కాంలో అక్రమ నగదు చలామణి (మనీలాండరింగ్), హవాలా మార్గాల ద్వారా భారీగా నిధులు చేతులు మారాయనే ఆరోపణలపై ఈడీ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబానికి ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసుల ఆధారంగా చెవిరెడ్డి భార్య, ఆయన కుమారుడు తాజాగా ఈడీ విచారణకు హాజరయ్యారు. మద్యం వ్యాపారాలు, లైసెన్సుల కేటాయింపుల వ్యవహారంలో చెవిరెడ్డి భార్య పేరిట భారీ ఎత్తున అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ..మిగతా 2లో





2

## ఋతుపవనాల రాక ఆలస్యం

మే 26న ప్రవేశిస్తాయన్న ఐఎండీ

మరో నాలుగైదు రోజుల పట్టే అవకాశం

అనకూలంగా లేని వాతావరణ పరిస్థితులు

## స్థానిక ఎన్నికలపై వ్యూహం

భవిష్యత్తు క్యార్యాచరణకు రూపకల్పన

క్షేత్రస్థాయిలో బలోపేతానికి మాస్టర్ ప్లాన్

నేతలతో జగన్ కీలక సమావేశం నేడు



(తాడేపల్లి - జయజయహే)

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతోంది. గత ఎన్నికల ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని, పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే లక్ష్యంతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం పార్టీ ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ భేటీకి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పార్లమెంట్ మరియు అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్లందరినీ ఆహ్వానించారు. పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ..మిగతా 2లో

For a pure tomorrow.. జయహో

# రుతుపవనాల రాక ఆలస్యం

**మే 26న ప్రవేశిస్తాయన్న ఐఎండీ**

**మరో నాలుగైదు రోజుల పట్టే అవకాశం**

**అనకూలంగా లేని వాతావరణ పరిస్థితులు**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



నైరుతి రుతుపవనాల రాక కోసం దేశం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అయితే, కేరళలో రుతుపవనాలు ఇంకా ప్రవేశించలేదని భారత వాతావరణ శాఖ మంగళవారం స్పష్టం చేసింది. మే 26 నాటికే రుతుపవనాలు కేరళను తాకుతాయని మే 15న ఐఎండి అంచనా వేసినప్పటికీ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కేరళలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నా, అధికారికంగా రుతుపవనాల రాకను ప్రకటించేందుకు అవసరమైన ప్రమాణాలు ఇంకా పూర్తి కాలేదు.

నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాయని ప్రకటించడానికి వాతావరణ శాఖ కొన్ని కఠినమైన నిబంధనలను పాటిస్తుంది. మినీకాయ్, అమిని, తిరువనంతపురం, కొచ్చి సహా కేటాయించిన 14 కేంద్రాల్లో కనీసం 60% కేంద్రాలు వరుసగా రెండు రోజుల పాటు 2.5 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతాన్ని నమోదు చేయాలి. అలాగే పశ్చిమ గాలుల వేగం మరియు లోతు ఒక నిర్ణీత స్థాయిని కలిగి ఉండాలి. ప్రస్తుతం కేరళలో ఒక రోజు మాత్రమే వర్షపాతం నమోదైందని, రెండో రోజు ఆ పరిస్థితి లేదని స్కైమెట్ వెదర్ ప్రతినిధులు తెలిపారు. అరేబియా సముద్రంలో ఏర్పడిన తుపాను గమనం వల్ల తేమను తనవైపు లాగేసుకోవడంతో మేఘాలు చెల్లాచెదురయ్యాయి. దీనివల్ల రాబోయే మరో నాలుగు రోజుల వరకు రుతుపవనాల రాక కష్టమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**'నిప్పుల కొలిమి'లా దేశం**

దక్షిణాది వానల కోసం ఎదురుచూస్తుంటే.. ఉత్తర, మధ్య భారతంలో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో తీవ్రమైన వడగాల్పులు వీస్తున్నాయి. పంజాబ్, హర్యానా, చండీగఢ్ ప్రాంతాల్లో వచ్చే మూడు రోజుల పాటు 'తీవ్ర వడగాల్పుల' హెచ్చరికలు జారీ అయ్యాయి.

మే 29 నుంచి గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఊరటనిచ్చే వార్త చెప్పింది. వచ్చే 2-3 రోజుల్లో ఈశాన్య భారతంతో పాటు కేరళ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మే 28 నుంచి జూన్ 4 మధ్య పశ్చిమ తీరంలో వర్షాలు విస్తరిస్తాయని ఐఎండి అంచనా వేస్తోంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే త్వరలోనే రుతుపవనాలు అరేబియా సముద్రం, బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉంది.

## పట్టాలెక్కనున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్

మొదటి పేజీ తరువాయి...



సౌత్ ఈస్టర్న్ రైల్వేల నుంచి రైల్వేబోర్డుకు చెందిన ఏ, బీ గ్రూపులకు చెందిన దాదాపు 60 మంది అధికారులు కొత్త జోన్‌లో జాయిన్ అయ్యారు. అలాగే మిగిలిన కేటగిరీలకు చెందిన 500 మంది ఉద్యోగులు కూడా కొత్త జోన్ కార్యాలయంలో చేరారు. అయితే ఇంకా 700 మంది వరకూ చేరాల్సి ఉంది. అయితే వారంతా జోన్ కార్యకలాపాలు ప్రారంభం అయిన తర్వాత నెమ్మదిగా వచ్చి చేరతారని రైల్వే అధికారిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. కొత్త జోనల్ కార్యాలయంలో అందరికీ ఒకే సారి ఆఫీస్ ఎకామిడేషన్ కల్పించడం కాస్త సమస్యగానే భావిస్తున్నారు. అందుకే విడతల వారీగా ఉద్యోగులను నియమించుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఒకే సారి పెద్ద ఎత్తున అధికారులు విశాఖకు వచ్చేస్తే వారందరికీ క్వార్టర్స్...ఇతర ఏర్పాట్లు చేసే అవకాశం లేకపోవడంతో సర్దుబాటు దిశగా కొత్త జోన్ అడుగులేస్తోంది. నార్తర్న్ రైల్వే నుంచి సందీప్ మాథుర్ విశాఖకు వచ్చి నూతన జోన్‌కు జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ అద్దాల డెక్ భవనంలో నూతన జోన్ ఆఫీస్ కార్యకలాపాలు 10 రోజుల కిందటే ప్రారంభించారు. ఒక్కొక్క పనినీ చేసుకుంటూ కొత్త జోన్ ముందుకు సాగుతోంది. ముడసర్లోవలో నిర్మితమవుతున్న రైల్వే జోన్ కార్యాలయం అన్ని హంగులు ఏర్పాటు చేసుకోవాలంటే కనీసం మరో రెండేళ్ళు పైగానే పట్టొచ్చని అంచనా వేస్తున్నారు. అప్పటి వరకూ వీఎంఆర్‌డీఏ భవనంలోనే కొత్త జోన్ కార్యాలయం నిర్వహించనున్నారు. అత్యాధునిక భవనం కావడంతో ఆర్కిటెక్చర్ పరంగా కూడా రైల్వే ఉన్నతాధికారులందరినీ ఆకర్షిస్తోంది. విశాఖ నడిబొడ్డున ఉండడం...రైల్వే స్టేషన్‌కు కూత వేటు దూరంలోనే ఈ జోనల్ కార్యాలయం ఉండడం కూడా కలిసొచ్చింది. రానున్న రోజుల్లో విజయవాడ, గుంటూరు, గుంతకల్ డీఆరఎంలతో సమావేశం కావాలన్నా రైలు..వాయు మార్గాలకు అనుకూలంగా ఈ కార్యాలయం ఉందని రైల్వే వర్గాలు సంతృప్తి చెందుతున్నాయి.

**విశాఖ ఆదాయం ఢమాల్...!**

నూతన రైల్వే జోన్ పుణ్యమా...ని విశాఖ రైల్వే డివిజన్ ఆదాయం ఢమాల్‌మని పడిపోయింది. ఒకప్పుడు దేశంలోనే వాల్తేరు ఆదాయం రెండు మడు స్థానాల్లో ఉండేది. అయితే ఇప్పుడు తాజా లెక్కల ప్రకారం నేల చూపులు చూస్తోందని రైల్వే వర్గాలు అంచనా వేస్తున్నాయి. జోన్ అయితే ఇచ్చారు కానీ వాల్తేరు డివిజన్‌లో ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న కేకే లైన్...కేఆర్ లైన్‌లను తీసేసుకుని అంటే ఏటా వచ్చే 12 వేల కోట్ల ఆదాయంలోంచి రూ. 7 వేల కోట్ల ఆదాయాన్ని రాయగడ డివిజన్‌లో కలిపేసి కేవలం రూ. 5 వేల కోట్ల ఆదాయం ఉండే విశాఖ డివిజన్‌ను మిగిల్చారు. పోరాటాలు చేసేటప్పుడే వాల్తేరు డివిజన్‌ను కొనసాగిస్తూ...కొత్త రైల్వే జోన్ కావాలంటూ డిమాండ్ చేయకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. అందుకు స్థానిక రాజకీయ నేతలు కూడా కేంద్రం వద్ద మోకరించడంతో భజన పరులుగా గుర్తించి జోన్ ఇచ్చేస్తున్నాం తన్నుకు చావండి అంటూ డివిజన్ లేకుండా చేసేసింది. ఆ తర్వాత మన నేతలు కళ్లు తెరచి చూసి సరికి బంగారు బాతును రాయగడకి అందించి...మిగిలిన ఆదాయం లేని భాగాన్ని విశాఖలో విలీనం చేసేశారు. దీంతో కన్నులొట్టబోయి అన్న చందంగా విశాఖ డివిజన్ ఏర్పాటయ్యింది. సుదీర్ఘ కాలంగా విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ కావాలంటూ పెద్ద ఎత్తున దశాబ్దాల కాలంగా ఆందోళనలు నిర్వహించిన చరిత్ర విశాఖ వాసుల సొంతం. సుదీర్ఘ పోరాటాలతోనే ఈ జోన్ ఏర్పాటయ్యింది.

## అంత డబ్బు ఎలా వచ్చింది..?

మొదటి పేజీ తరువాయి...

ఈడీ ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు సమాచారం. హవాలా మార్గాల ద్వారా కోట్ల రూపాయల మేర చేతులు మారినట్లు వస్తున్న ఆధారాలపై అధికారులు వీరిని విచారించారని తెలుస్తోంది. ఈ కుంభకోణంలో చెవిరెడ్డి భార్యతో పాటు ఆయన కుమారుడి పాత్రపై కూడా ఈడీ కీలక ఆధారాలు సేకరించిందని సమాచారం. ఈ కేసులో మరికొందరు రాజకీయ ప్రముఖులు, అధికారుల పేర్లు కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉండటంతో, తాజా ఈడీ విచారణ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

**ప్రతీ పైసా కష్టపడి సంప్షదించినదే..**

లిక్కర్ స్కాంలో ఈడీ విచారణ అనంతరం వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి స్పందించారు. ఈడీ అధికారులు అడిగిన అన్ని ఆస్తుల వివరాలనూ అందజేశామని తెలిపారు. విచారణకు తమవంతుగా పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు తాము సంపాదించిన ఆస్తుల వివరాలన్నింటినీ ఈడీకి సమర్పించామని మోహిత్ రెడ్డి వెల్లడించారు. తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయీ కష్టార్జితమే తప్ప అక్రమంగా సంపాదించలేదని స్పష్టం చేశారు. ఏపీ సిట్ కక్షపూరితంగా తమపై కేసులు నమోదు చేసిందని ఆరోపించారు. అయితే ఆ కేసులను న్యాయపరంగానే ఎదుర్కొంటామని చెప్పారు. ముడుపుల సొమ్ముతో ఆస్తులు కొనుగోలు చేశారంటూ ఆరోపణలు మాత్రమే ఉన్నాయని, వాటిలో నిజం లేదన్నారు. తాము సంపాదించిన ప్రతి పైసా కష్టపడి సంపాదించిన డబ్బేనని పేర్కొన్న మోహిత్ రెడ్డి.. ఈ కేసులపై న్యాయస్థానంలో పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు.

## చనిపోయిన వారిపై నిందలా..?

మొదటి పేజీ తరువాయి...

ఆమె విమర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆమె ఒక సుదీర్ఘ పోస్ట్‌ను షేర్ చేశారు. నిజంగా వైఎస్ రాజారెడ్డి, వైఎస్సార్ అంత దుర్మార్గులే అయితే.. ఆనాడు తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు విచారణ జరపలేదు? ఎందుకు శిక్షించలేదు? మీకు చేతకాలేదా? అంటూ షర్మిల నేరుగా టీడీపీని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా, చెప్పుకోదగ్గ విజయాలు లేకనే పాత విషయాలను లాగి రాజకీయం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఈ నీచ రాజకీయాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ రాజారెడ్డి సీమలో అరాచకాలను ఎదురించి పేదల పక్షాన నిలబడ్డ వ్యక్తి అని షర్మిల గుర్తు చేశారు. 1973లోనే కడప ప్రజల కోసం 70 పడకల ఆసుపత్రి కట్టించి ఉచిత వైద్యం అందించారని, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీలు కట్టించి పేదలకు విద్యను అందించిన ఘనత ఆయనదేనని పేర్కొన్నారు. ఇలాంటి మహానుభావుడి చరిత్రను వక్రీకరిస్తే రాయలసీమ ప్రజలు హర్షించరని హెచ్చరించారు.

సంక్షేమం, అభివృద్ధి అనే పదాలకు చిరునామా వైఎస్సార్ అని షర్మిల కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, రుణమాఫీ వంటి పథకాలు వైఎస్సార్‌కే సాధ్యమయ్యాయని, ఆయనను సూర్యుడితో పోల్చారు. బురద జల్లాలని చూసినంత మాత్రాన సూర్యుడి కాంతి తగ్గదు. పోలవరం పనులను 33 శాతం పూర్తి చేసిన అపర భగీరథుడు వైఎస్సార్. కానీ చంద్రబాబుకు రుణమాఫీ గానీ, నిరుద్యోగ భృతి గానీ, మహిళలకు 15 వందలు ఇవ్వడం గానీ చేతకావడం లేదు అని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ మరణ వార్త విని 700 మంది గుండెలు పగిలి చనిపోయారని, నేడు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి ఇంటా పూజ గదిలో ఆయనకు స్థానం ఉందని షర్మిల అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజల గుండెల్లో ఆయన స్థానాన్ని చెరపలేరని స్పష్టం చేశారు. ఇకనైనా ఒట్టి మాటలు కట్టిపెట్టి, ఓట్లేసిన ప్రజలకు మేలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆమె హితవు పలికారు.



## స్థానిక ఎన్నికలపై వ్యూహం

మొదటి పేజీ తరువాయి...

ఖరారు చేసేందుకు ఈ సమావేశం అత్యంత కీలకం కానుంది. ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానున్న అంశం పార్టీ కమిటీల నిర్మాణం. పార్టీ అధికారంలో లేని సమయంలో క్షేత్రస్థాయిలో కేడర్ నిరుత్సాహానికి గురికాకుండా ఉండేందుకు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కొత్త కమిటీలను నియమించాలని జగన్ భావిస్తున్నారు. పాత, కొత్త నేతల మధ్య సమన్వయం కుదురుస్తూ, చురుగ్గా పనిచేసే యువతకు పెద్దపీట వేయాలనే యోచనలో ఆయన ఉన్నారు. పార్టీకి వెన్నెముకలా నిలిచే సోషల్ మీడియా విభాగాన్ని కూడా మరింత పటిష్టం చేయడంపై ఈ సమావేశంలో దిశానిర్దేశం చేయనున్నారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ సమావేశంలో జగన్ ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోబోతున్నారు. గతంలో ఎదురైన చేదు అనుభవాలను పక్కన పెట్టి, ప్రతి ఊరిలోనూ గట్టిగా పోరాడాలని ఆయన నేతలకు పిలుపునిచ్చే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను అందిపుచ్చుకుని, స్థానిక సంస్థల్లో మెజారిటీ స్థానాలను గెలవడం ద్వారా మళ్లీ పుంజుకోవాలని వైసీపీ భావిస్తోంది. ఓటమి తాత్కాలికం.. పోరాటమే శాశ్వతం అనే నినాదంతో నేతల్లో ధైర్యం నింపే ప్రయత్నం జగన్ చేయనున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, నిలిపివేసిన సంక్షేమ పథకాలు, మరియు పెరిగిన నిత్యావసర ధరల వంటి అంశాలపై జగన్ తన గళాన్ని పెంచనున్నారు. ముఖ్యంగా 'సూపర్ సిక్స్' హామీల అమలులో జరుగుతున్న జాప్యంపై ప్రజల్లోకి ఎలా వెళ్లాలి? ఏ విధంగా ఆందోళనలు చేపట్టాలి? అనే దానిపై రోడ్ మ్యాప్ సిద్ధం చేయనున్నారు. అసెంబ్లీ లోపల మరియు వెలుపల ప్రజా సమస్యలపై పోరాడటం ద్వారానే పార్టీకి పూర్వవైభవం వస్తుందని జగన్ బలంగా నమ్ముతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దూకుడుగా ఉన్న తరుణంలో, వైసీపీ నేతలు కొందరు పార్టీ మారుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో అందరినీ ఒకతాటిపైకి తెచ్చి, పార్టీ దృఢంగా ఉందని చాటిచెప్పడమే ఈ విస్తృత స్థాయి సమావేశం ప్రధాన ఉద్దేశ్యం. ముఖ్యంగా నియోజకవర్గ కోఆర్డినేటర్లకు బాధ్యతలు అప్పగించి, వారిని ప్రజల్లోనే ఉండాలని జగన్ ఆదేశించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలే సెమీఫైనల్స్‌గా భావించి పోరాడాలని ఆయన స్పష్టం చేయనున్నారు.



## గోదావరి కాలుష్యంపై కన్నెర్ర

మొదటి పేజీ తరువాయి...

తనిఖీ చేశారు. పేపర్ మిల్స్ యాజమాన్యం తూర్పులంకలోని ప్రత్యేక మడుగుల్లో కాలుష్యకారక నీటిని విడిచిపెడుతున్న వైనాన్ని పరిశీలించారు. ఏ మేరకు శుద్ధి చేసి అక్కడ విడిచి పెడతారు? ఆ ప్రాంత జలాల్లో ఉన్న కాలుష్యం ఎంత అన్న విషయాలను ప్రత్యక్షంగా వెళ్లి తెలుసుకున్నారు. మట్టి, నీటి నమూనాలను సేకరించి అక్కడే మొబైల్ కిట్స్ ద్వారా పరీక్షలకు జరిపించారు. కాలుష్యకారకాలు ఉన్నట్లు గుర్తించి, నిబంధనలను పాటించనందున వెంటనే పరిశ్రమకు నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

మడుగుల్లో గుర్రపు డెక్క పేరుకుపోయిన తీరుపై పీసీబీ అధికారులను పవన్ ప్రశ్నించారు. పరిశ్రమలకు రాయితీలపై భూములు ఇచ్చి ప్రోత్సహిస్తుంటే కనీసం పర్యావరణ స్పృహ కూడా లేకపోతే ఎలా అంటూ నిలదీశారు. ఇంత కాలుష్యం విడుదల చేస్తున్న ఆంధ్ర పేపర్ మిల్క్ ఎందుకు నోటీసులు ఇవ్వలేదని కాలుష్య నియంత్రణ మండలి అధికారులపై పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఆ పరిశ్రమ చెల్లించాల్సిన రూ.13 కోట్ల బకాయిలు ఎందుకు వసూలు చేయలేకపోతున్నారని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని ప్రశ్నించారు. అధికారులు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించకపోతే ప్రజలకు మేం సమాధానం చెప్పుకోవాలంటూ అధికారులపై పవన్ కల్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి నీటినీ నదిలోకి వదిలి అక్కడ మన పిల్లల్ని స్నానం చేయించే సాహసం చేయగలమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమల కాలుష్యం విషయంలో కాలుష్య నియంత్రణ నిబంధనలు అందరూ పాటించాల్సిందేనని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. పరిశ్రమలు వాటిని పాటించేలా అధికారులు పని చేయాలని, క్షేత్రస్థాయిలో మీకు ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని ముఖ్యమంత్రితో, కేబినెట్ లో మాట్లాడి పరిష్కరిస్తానని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

గోదావరిలో కాలుష్య నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. సాస్కి నిధులతో చేపట్టిన రోడ్ల పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్రం నుంచి ఏ ప్రాజెక్టులకు నిధులు తీసుకురావచ్చో ప్రతిపాదనలు అడిగారు. రాజమహేంద్రవరం సమీపంలో దోబీఘాట్ కోసం మాడ్యులార్ ట్రీట్‌మెంట్‌ను నిర్మించాలని ఆదేశించారు. కాలుష్య నివారణ చర్యల కోసం రూ.100 కోట్లు పీసీబీకి ఇవ్వాలని పవన్ కోరారు. రూ.100 కోట్లతో గోదావరిలో కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలకు ఆదేశించారు. రాజమహేంద్రవరం సమీపంలోని కాతేరును వీఐపీ ఘాట్‌గా సిద్ధం చేయాలన్నారు. మునికూడలిని మోడల్ పుష్కరఘాట్‌గా సిద్ధం చేయాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ నిధులతో జూన్ 25లోపు మోడల్ ఘాట్ సిద్ధం చేయాలన్నారు. ప్లాస్టిక్ స్థానంలో బయోడీగ్రేడబుల్ వస్తువులు వినియోగించాలని అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశించారు.

## డేరా బాబాకు మళ్లీ పెరోల్

**16వ సారి తాత్కాలికంగా జైలు బయటకు**

**20 ఏళ్ల జైలు శిక్షలో ఏడాదిన్నర జైలు వెలుపలే**

**నిబంధనల ప్రకారమే అంటున్న అధికారులు**

**వరుస పెరోల్ మంజూరుపై విమర్శల వెల్లువ**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



హర్యానాలోని రోహ్‌తక్ జిల్లా సునారియా జైలు గేట్లు మంగళవారం తెల్లవారుజామున మళ్ళీ తెరుచుకున్నాయి. సరిగ్గా ఉదయం 6:34 గంటలకు డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ జైలు నుంచి బయటకు వచ్చారు. గతంలో ఆయన విడుదలైనప్పుడు భారీ భద్రత, హడావిడి కనిపించేది, కానీ ఈసారి మాత్రం చాలా నిశ్శబ్దంగా, తక్కువ భద్రత మధ్య ఆయన తన కాన్వాయ్‌లో సిర్సా వైపు వెళ్ళిపోయారు. హర్యానా ప్రభుత్వం ఆయనకు 30 రోజుల పెరోల్ మంజూరు చేయడంతో ఈ విడుదల సాధ్యమైంది. రామ్ రహీమ్ సింగ్ 2017లో దోషిగా తేలినప్పటి నుంచి ఇప్పటివరకు 16 సార్లు తాత్కాలికంగా జైలు నుంచి బయటకు వచ్చారు. 20 ఏళ్ల జైలు శిక్షలో ఆయన ఇప్పటికే దాదాపు 436 రోజులు జైలు వెలుపల, అంటే పెరోల్ లేదా ఫర్లోపై గడిపారు. అంటే ఆయన శిక్షా కాలంలో దాదాపు ఏడాదిన్నర కాలం జైలు బయటే గడిచిందన్నమాట. ఈ ఏడాదిలోనే ఆయనకు ఇది మూడో పెరోల్. జనవరిలో 40 రోజులు, మే నెలలో ఇప్పుడు మరో 30 రోజులు బయటకు వచ్చారు. ఒక దోషికి ఇన్నిసార్లు పెరోల్ ఇవ్వడంపై దేశవ్యాప్తంగా విమర్శలు వస్తున్నప్పటికీ, అధికారులు మాత్రం నిబంధనల ప్రకారమే ఇస్తున్నామని చెబుతున్నారు.

**చట్టం ఏం చెబుతోంది?**

ఒక అత్యాచార నిందితుడికి ఇన్నిసార్లు స్వేచ్ఛ ఎలా లభిస్తుందనే సందేహం కలగడం సహజం. దీని వెనుక హర్యానా ప్రభుత్వం 2022లో తీసుకొచ్చిన 'గుడ్ కండక్ట్ ప్రిజనర్స్ ఆక్ట్' ఉంది. ఈ చట్టం ప్రకారం, జైలులో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలు ఏడాదికి 70 రోజుల పెరోల్, 21 రోజుల ఫర్లో పొందే వెసులుబాటు ఉంటుంది. "రామ్ రహీమ్ సింగ్‌కు చట్టబద్ధంగానే పెరోల్ లభించింది. ఈ 30 రోజుల పాటు ఆయన సిర్సాలోని డేరా సచ్చా సౌదా ఆశ్రమంలోనే ఉంటారు" అని ఆయన తరపు న్యాయవాది జితేంద్ర ఖురానా ధృవీకరించారు. లైంగిక వేధింపుల కేసులో శిక్ష అనుభవిస్తున్న రామ్ రహీమ్‌కు ఇటీవల ఇతర కేసుల్లో పెద్ద ఉపశమనం లభించింది. జర్నలిస్ట్ రామచంద్ర ఛత్రపతి హత్య కేసులో పంజాబ్, హర్యానా హైకోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. అంతకుముందు డేరా మేనేజర్ రంజిత్ సింగ్ హత్య కేసులోనూ ఆయనకు క్లీన్ చిట్ లభించింది. ఈ పరిణామాలు ఆయన మద్దతుదారుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. అయితే, ఎన్నికల సమయంలో లేదా కీలక రాజకీయ పరిణామాల వేళ ఆయనకు పెరోల్ రావడంపై విపక్షాలు ఎప్పటికప్పుడు విమర్శలు గుప్పిస్తూనే ఉన్నాయి. పెరోల్ సమయంలో ఆయన ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ, ఆయన ప్రభావం మాత్రం ఓటర్లపై ఉంటుందనేది బహిరంగ రహస్యం.

# లోకేష్ శాఖ అక్రమాలపై పవన్ ఎందుకు మౌనం?

## డీఎస్సీ స్కామ్‌పై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: మాజీ ఎంపీ మార్గాని భరత్

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**



"ప్రశ్నిస్తా" అంటూ రాజకీయాల్లోకి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శాఖలో జరిగిన డీఎస్సీ అక్రమాలపై ఎందుకు నోరు మెదపడం లేదని వైఎస్సార్‌సీపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ ప్రశ్నించారు. రాజమహేంద్రవరంలోని మార్గాని ఎస్టేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.మెగా డీఎస్సీ పేరుతో రాష్ట్రంలో భారీ స్కామ్ జరిగిందని, ఒక్కో టీచర్ పోస్టును రూ.15 లక్షల చొప్పున అమ్ముకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. డీఎస్సీ పరీక్ష రాసే వ్యక్తికే ప్రశ్నాపత్రాల తయారీ బాధ్యతలు అప్పగించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ జరిగిన తర్వాత కూడా సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోకపోవడం వెనుక కారణాలేమిటని నిలదీశారు. మెరిట్ లిస్ట్ విడుదల చేయకుండా ప్రభుత్వం దాచిపెట్టిందని ఆరోపించారు.ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని, లేదంటే సీబీఐ దర్యాప్తుకు అప్పగించాలని డిమాండ్ చేశారు. 3.36 లక్షల మంది నిరుద్యోగులు పరీక్షలు రాసిన పరిస్థితిలో ఉద్యోగాల విక్రయ ఆరోపణలు రావడం అత్యంత దురదృష్టకరమన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి సిఫార్సులు లేకుండా ప్రతిభ ఆధారంగా 1.20 లక్షల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి ఇప్పటి వరకు ఎంతమందికి అందిందో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు.గోదావరి కాలుష్య నియంత్రణ అంశంపైనా మార్గాని భరత్ స్పందించారు. గోదావరి నది కలుషితం కాకుండా ఉండేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.756 కోట్లతో డీపీఆర్ రూపొందించి కేంద్రానికి పంపిందని తెలిపారు. తన ఎంపీ పదవీకాలంలో కేంద్ర జలశక్తి శాఖ ద్వారా ఎన్ఆర్‌సీపీ పథకం కింద రూ.88 కోట్లు తీసుకువచ్చినట్లు చెప్పారు. రాజమహేంద్రవరంలో రోజుకు 80 ఎంఎల్‌డీ మురుగు నీరు ఉత్పత్తి అవుతుండగా, తమ హయాంలో ఎస్టీపీ ప్లాంట్ పనులు 50 శాతం పూర్తయ్యాయని అన్నారు.అయితే స్థానిక ఎమ్మెల్యే కమిషన్ల కోసం కాంట్రాక్టర్‌ను బెదిరించి పనులు నిలిపివేశారని ఆరోపించారు. ప్రస్తుతం శుద్ధి చేయని కలుషిత నీటిని నేరుగా గోదావరిలోకి వదులుతున్నారని, దీనివల్ల ప్రజల్లో కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. పవన్ కళ్యాణ్ స్వయంగా ఎస్టీపీ ప్లాంట్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించాలని సూచించారు.ఇసుక మాఫియా అక్రమాలపై కూడా భరత్ ఆందోళన వ్యక్తం చేశారు. గ్యామన్ ఇండియా బ్రిడ్జి వద్ద భారీ స్థాయిలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, డ్రెడ్జింగ్ కారణంగా గోదావరిలో ప్రమాదకర గోతులు ఏర్పడుతున్నాయని తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాల సమయంలో ఈ గోతుల వద్ద సుడులు ఏర్పడి ప్రజల ప్రాణాలకు ముప్పు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. బోట్‌మెన్ సొసైటీకే ఇసుక తవ్వకాల హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో అవినీతి, ఇసుక మాఫియా, మట్టి మాఫియా, చిట్టీల మాఫియా రెచ్చిపోతున్నాయని ఆరోపించిన మార్గాని భరత్, నగరంలో జరుగుతున్న అక్రమాలపై పవన్ కళ్యాణ్ సమగ్ర సమీక్ష నిర్వహించాలని కోరారు.

## కంబాల ఆధ్వర్యంలో గర్భిణీలు, రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ

**గోకవరం జయ జయహే ప్రతినిధి**



విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలోసుమారుగా రెండేళ్లు నుంచి గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో గర్భిణీలు, అక్కడికి చికిత్స కోసం వచ్చే రోగులకు ప్రతి మంగళవారం పాలు, పండ్లు, రొట్టెలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారుఈ మంగళవారం కూడా యధావిధిగా రామసేన సభ్యులు, సిబ్బంది, బీజేపీ నాయకులు, వైద్య సిబ్బంది రోగులకు పాలు, పండ్లు, రొట్టెలను పంపిణీ చేసారుఈ కార్యక్రమంలో నాగరమేష్, వీరాంజలి, నిడదవోలు వీరబాబు, కౌశిక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బావోజీపేట కబడ్డీ టోర్నమెంట్‌కు కంబాల లక్ష రూపాయలు విరాళం

**గోకవరం జయ జయ హే ప్రతినిధి**



గోకవరం మండలం బావోజీ పేట గ్రామంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న, కబడ్డీ టోర్నమెంట్ కు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు లక్ష రూపాయలు విరాళం అందించారు. ఇటీవలే బావోజీ పేట హనుమాన్ యూత్ సభ్యులు, కంబాల శ్రీనివాసరావుని కలిసి, కబడ్డీ టోర్నమెంట్ సహకారం అందించాలని కోరారు. స్పందించిన ఆయన లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. ప్రస్తుతం ఆయన అమెరికాలో ఉండటంతో ఆ నగదును వారికి అందించాలని రామసేన సభ్యులు, బీజేపీ నాయకులను ఆదేశించారు. ఆయన ఆదేశాల ప్రకారం గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద లక్ష రూపాయలు నగదును బావోజీ పేట గ్రామ పెద్దలు, కబడ్డీ యూత్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు కంబాల శ్రీనివాసరావుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు పెద్దాడ వెంకన్న దొర, అంబటి శ్రీను, గ్రామస్తులు జీ. రామకృష్ణ, బుల్లబ్బాయి, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### కాలుష్యరహిత గోదావరి లక్ష్యంగా

# పుష్కరాల ఏర్పాట్లు

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**


వచ్చే గోదావరి పుష్కరాలను "కాలుష్యరహిత గోదావరి" లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం పుష్కరాల ఘాట్ నుంచి గోదావరిలో పడవ ప్రయాణం చేస్తూ పుష్కరాల పనులు, గోదావరి తీర ప్రాంత కాలుష్య పరిస్థితులను ఆయన మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా గోదావరిలోకి నేరుగా కలుస్తున్న నల్లా ఛానెల్ కాలుష్యం, పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వ్యర్థ జలాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా గోదావరి పేపర్ మిల్ వ్యర్థ జలాలను ఎక్కడ, ఎలా శుద్ధి చేస్తున్నారో పోల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ శ్రీకృష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. కాలుష్య నియంత్రణకు సంబంధించి శాస్త్రీయ విధానాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

అనంతరం నల్లా ఛానెల్ డ్రైనేజీ పంపింగ్ స్టేషన్‌ను స్వయంగా పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి, రోజువారీగా వచ్చే మురుగు నీటిని ఎలా శుద్ధి చేస్తున్నారో ఆరా తీశారు. గృహాల నుంచి విడుదలవుతున్న వ్యర్థాలను వేరు చేసే విధానం, మురుగు నీటి శుద్ధి ప్రక్రియపై అధికారులను ప్రశ్నించారు. రోజుకు సుమారు 55 మిలియన్ లీటర్ల మేర మురుగు నీరు రాజమహేంద్రవరం నగరం నుంచి విడుదలవుతుండగా, అందులో కేవలం 15 శాతం మాత్రమే సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి అవుతోందని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు.

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను పారదర్శకంగా వినియోగించి, పూర్తి స్థాయిలో మురుగు నీటిని శుద్ధి చేసిన తర్వాతే గోదావరిలోకి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. గోదావరి గట్టు సుందరీకరణ, పుష్కరాల పనుల పురోగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఉప ముఖ్యమంత్రికి వివరించారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# ఎంతటి వారికైనా శిక్ష తప్పదు

**(ప్రత్యేక ప్రతినిధి జయ జయహే)**

కాంతర సినిమా వివాదం దేశవ్యాప్తంగా మరోసారి చర్చనీయాంశమైంది. బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ కర్ణాటక హైకోర్టు ఆదేశాల మేరకు మైసూరులోని ప్రసిద్ధ శ్రీ చాముండేశ్వరి ఆలయంను సందర్శించి అపరాధ పరిహారం నిమిత్తమై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత ఏడాది గోవాలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్ర మహోత్సవంలో కాంతర సినిమాలో చూపించిన పంజూర్లి దైవారాధన, భూతకోల సంప్రదాయాలపై ఆయన చేసిన హేళన పూరిత వ్యాఖ్యలు, వెకిలి హావభావాలు వివాదానికి దారితీశాయి. స్థానిక సంస్కృతి, శతాబ్దాల నాటి ఆచారాలను అవమానించేలా మాట్లాడారని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలు ప్రాంతాల్లో కేసులు నమోదు చేశారు. విచారణ చేపట్టిన కర్ణాటక హైకోర్టు భక్తుల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి సినీ ప్రముఖుడిపై ఉందని స్పష్టం చేసింది. అలాగే, శ్రీ చాముండేశ్వరి ఆలయంలో ప్రాయశ్చిత్త పూజలు నిర్వహించాలని రణ్‌వీర్ సింగ్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో రణ్‌వీర్ సింగ్ ఆలయంలో శాస్త్రోక్తంగా పూజలు, హోమాలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ ఘటన సినీ రంగానికి సంస్కృతి, సంప్రదాయాల పట్ల బాధ్యత అవసరమనే సందేశాన్ని ఇచ్చింది.

# అమ్మో ఒకటో తారీఖు

**మొదటి పేజీ తరువాయి...**

నిపుణులు అంటున్నారు. ఇటు.. సోమవారం మే 25న పెట్రోల్ పై లీటర్‌కు రూ. 2.61 డీజిల్‌పై 2.71 చొప్పున పెరిగింది. ఆర్థిక వ్యవస్థలో రవాణా రంగానిది ముఖ్యపాత్ర. కూరగాయల నుంచి పాలు వరకు.. ఆన్‌లైన్ డెలివరీ నుంచి విమాన టికెట్ల వరకు.. అన్నీ డీజిల్, పెట్రోల్‌పైనే ఆధారపడతాయి. దాంతో ఇంధన ధరలు పెరిగిన ప్రతిసారీ ఆ ప్రభావం సామాన్యుడి జేబుపైనే పడుతుంది. ముందుగా ప్రజా రవాణాలో బస్సులు, ఆటోలు, క్యాబ్‌లు, ట్యాక్సీల ఛార్జీలు పెరగొచ్చని తెలుస్తోంది. సరుకు రవాణా ఖర్చులు పెరిగితే మార్కెట్‌లో కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, పాల ధరలు మరింత పెరగొచ్చు. ఇప్పటికే కమర్షియల్ గ్యాస్ ధరలు పెరిగాయి. త్వరలోనే గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ రేట్లు కూడా పెరగొచ్చని అంచనా. ఇక ఫుడ్ డెలివరీ యాప్‌లు, ఈ-కామర్స్ కంపెనీలు కూడా డెలివరీ ఛార్జీలను పెంచవచ్చు. ప్రస్తుతం డిస్కౌంట్లతో వినియోగదారులను ఆకర్షిస్తున్న కంపెనీలు.. పెరిగిన లాజిస్టిక్స్ ఖర్చుల కారణంగా ఆ ఆఫర్లను తగ్గించే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా మారే ప్రమాదం ఉంది. ట్రాక్టర్లు, మోటార్లు, నీటి పంపులు వంటి వ్యవసాయ పరికరాల కోసం రైతులు డీజిల్‌పైనే ఆధారపడతారు. డీజిల్ ధరలు పెరగడం వల్ల సాగు ఖర్చులు పెరిగి.. చివరకు ఆ భారం ఆహార ధరల రూపంలో ప్రజలపైనే పడుతుంది. ఇప్పటివరకు ఇన్‌ఫ్లేషన్ ను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గిస్తూ వచ్చింది. కానీ అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పెరగడం, అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతలు చల్లారే సూచనలు లేకపోవడం, హర్మూజ్‌లో అనిశ్చితితో రాబోయే రోజుల్లో మరిన్ని ధరల పెంపు తప్పదన్న చర్చ వినిపిస్తోంది.




# కిషోర్ వికాసం ద్వారా బాలల జీవన నైపుణ్య అభివృద్ధి

**చోడవరం మే 26 జయ జయహే**

రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల చోడవరం అంగన్వాడి కేంద్రంలో మంగళవారం "కిషోర్ వికాసం వేసవి కాల సమావేశ" కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సమావేశశీలో 11 ఏళ్ల నుండి 18 ఏళ్ల" లోపు గల బాల బాలికలకు జీవన నైపుణ్య అభివృద్ధి,రుతుస్రావం పరిశుభ్రత,ఆరోగ్యం,యోగ, విద్య,భవిష్యత్ పై అవగాహన స్మార్ట్ ఫోన్స్, ఫోక్సో,గృహహింస చట్టాలపై అవగాహన డ్రగ్స్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈనెల 1 నుండి జూన్ 10 వరకు వారంలో రెండు రోజులు మంగళవారం , శుక్రవారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ఆడ పిల్లలతో, మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు మగ పిల్లలతో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి అర్థం అయిన భాషలో అన్ని విషయాలపై అవగాహన కల్పించి 15 మంది పిల్లలకు తక్కువ లేకుండా 20 మంది పిల్లలకు మించకుండా ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి పిల్లల సమస్యలు లేని గ్రామంగా చేయడం దీని ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చోడవరం సిఐ పి . అప్పలరాజు హాజరై కిషోరి వికాసం "సెషన్ 8 లో భాగంగా"శారీరక వ్యాయామం ప్రాముఖ్యత" కోసం పిల్లలకు అవగాహన కల్పించడం జరిగింది.బాలల అవసరాలు చదువు చదువుకు కావలసిన పుస్తకాలు,ఆరోగ్యం, ఆడుకోవడానికి కావలసిన వస్తువులు,మానసిక స్థిరత్వం వంటి విషయాలను, పిల్లలపై జరుగుతున్న వేధింపులు,పిల్లల హక్కులకు భంగం కల్పించే విధంగా ఉండటం,చదువు మధ్యలో ఆపివేయడం,ఆర్థిక పరిస్థితులు,ఫీర్ గ్రూప్స్ ప్రెషర్,స్మార్ట్ ఫోన్ కి దూరంగా ఉంటూ వారి భవిష్యత్తును రక్షించుకోవాలని తెలియజేశారు.ఈ కార్య క్రమంలో సిడిపిఓ వి.మంగతాయారు, వెలుగు ఏపిఎం బి.డి.తిలక్, డి ఆర్ డి ఏ అధికారి ఎం.రమేష్, జిల్లా బాలల సంరక్షణ అధికారి, కె.ఎల్.మనోహర్, రక్షణ అధికారి, కె.ఎమ్.వి.మంజులవాణి, సెంటర్ అడ్మినిస్ట్రేటర్, సరస్వతి, కేస్ వర్కర్, వన్ స్టాప్ సెంటర్, బి.మంగ, సామాజిక కార్యకర్త, శాంతి ప్రియ, శ్రీదేవి, నిర్మల-సూపర్వైజర్స్, అంగన్వాడీ టీచర్స్ పిల్లలు పాల్గొన్నారు.

# కాతేరు వద్ద అక్రమ డ్రెడ్జింగ్‌పై ఉక్కుపాదం.. రెండు బోట్లు సీజ్

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**





కాతేరు సమీపంలో అక్రమంగా నిలిపి ఉంచిన రెండు డ్రెడ్జింగ్ పడవలను జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారులు సీజ్ చేశారు. గనులు మరియు భూగర్భ శాఖ, రెవెన్యూ శాఖ, నీటిపారుదల శాఖల సంయుక్త బృందం మంగళవారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో ఈ చర్యలు చేపట్టినట్లు జిల్లా గనులు మరియు భూగర్భ అధికారి డి. ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు.గామన్ బ్రిడ్జి నుంచి అప్‌స్ట్రీమ్ వైపున సుమారు 1.5 కిలోమీటర్ల దూరంలో, చైనేజ్ కి.మీ 15.00 వద్ద గండిపోసమ్మ దేవాలయం సమీపంలో ఈ రెండు డ్రెడ్జింగ్ బోట్లు గుర్తించినట్లు వెల్లడించారు. వాటిలో ఒక పడవ "దుర్గా వారాహి"గా గుర్తించబడిందన్నారు.విచారణలో ఈ పడవల యజమాని పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం వెల్పూరు గ్రామానికి చెందిన కర్రి వెంకట రత్నం అని, వాటి నిర్వహణ బాధ్యతలు పి. గన్నవరం నివాసి కె. గంగాజలం నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నూతన ఇసుక విధానం--2024 నిబంధనలకు విరుద్ధంగా డ్రెడ్జింగ్ బోట్లు నిలిపి ఉంచినందున వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు.పర్యావరణ మార్గదర్శకాలు, గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఇసుక తవ్వకాల కోసం డ్రెడ్జింగ్ బోట్ల వినియోగం నిబంధనల ఉల్లంఘన కిందికి వస్తుందని అధికారులు స్పష్టం చేశారు. సీజ్ చేసిన పడవలను తదుపరి చర్యల నిమిత్తం నీటిపారుదల శాఖ అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు.అలాగే బ్రిడ్జిలకు ఇరువైపులా 500 మీటర్ల పరిధిలో ఎటువంటి ఇసుక తవ్వకాలు నిర్వహించినా కఠిన శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ సాంకేతిక సిబ్బంది, రెవెన్యూ శాఖ అధికారులు, ఇరిగేషన్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహే



## ప్రభుత్వ భూముల కబ్జాలపై కఠిన చర్యలు తీసుకోండి

**కబ్జాలపై మీడియాతో పర్యటిస్తా**

**పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు**

**పెందుర్తి, మే 26, జయ జయహే**

పెందుర్తి నియోజక వర్గంలో భూ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించే ప్రశ్నే లేదని జనసేన విశాఖ ఉమ్మడి రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు స్పష్టం చేశారు. భూకబ్జాలలో తన పార్టీ వారైనా, కుటుంబీకులైనా ప్రమేయం ఉంటే సహించబోనని పునరుద్ఘాటించారు. మంగళవారం సుజాతనగర్ క్యాంపు కార్యాలయం లో పెందుర్తి మండల రెవెన్యూ అధికారి వెంకట అప్పారావు, పెందుర్తి సిఐ కెవి సతీష్ కుమార్, జీవీఎంసీ జోన్ 8 ఏసీపీ రామలింగారెడ్డి తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మీడియాలో వస్తున్న కథనాలపై తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. నిరాధార వార్తలు ప్రచురించి వ్యక్తిగతంగా తనకు, కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావడం ఆందోళన కలిగిస్తుందని పేర్కొన్నారు. ఏదైనా ఆరోపణకు సంబంధించిన వార్త రాసే ముందు తన వివరణ గాని, సంబంధిత అధికారుల వివరణ గాని తీసుకుని వార్తలు ప్రచురించాలని కోరారు. ముఖ్యంగా భూ అక్రమాలలో కూటమి నాయకులు ప్రమేయం అంటూ వార్తలు రాసే ముందు కచ్చితంగా వివరణ తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. కొందరు విలేకరులు తొందరపాటుతో రాసిన వార్తలు, ప్రభుత్వానికి, ఎమ్మెల్యేగా తనకు భారీ ఎత్తున నష్టం కలిగిస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ఎమ్మెల్యేగా తాను గెలిచిన మొదటి రోజు నుండి ప్రభుత్వ భూముల ఆక్రమణలను, అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించ బోనంటూ స్పష్టంగా చెబుతున్నప్పటికీ ఇంకా కొందరు విలేకరులు నిరాధార ఆరోపణలు చేస్తూ జనాల్లో అయోమయం కలిగిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని స్పష్టం చేశారు. అలాగే మీడియాలో వస్తున్న కథనాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి తక్షణం చర్యలు చేపట్టాలని ఎమ్మార్వోకు సూచించారు. వచ్చే శనివారం మీడియాలో వచ్చిన కథనాలకు సంబంధించి భూ ఆక్రమణలు, చెరువుల కబ్జా తదితర అంశాలను మీడియా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించి చర్యలు చేపడతామని ఈ సందర్భంగా తెలియజేశారు. జీవీఎంసీ 97వ వార్డు కార్మిక నగర్ చెరువు కబ్జాకాండపై అతి త్వరలో చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. అలాగే టీచర్స్ లేఅవుట్ సమీపంలో ఎన్నారై భూమి వివాదం గురించి రెవిన్యూ అధికారులు తేలుస్తారని పేర్కొన్నారు.

## మాధవధారలో ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

**మర్రిపాలెం , మే 26, జయ జయహే :**



ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల మాధవధార రామాలయం వీధి,పలు ప్రాంతాలలో సీఐ శంకర్ నారాయణ ఆదేశాల మేరకు ఎస్సై కార్తీక్ ఆధ్వర్యంలో మంగళవారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ప్రతి ఇంటిని పోలీసులు తనిఖీ చేసి సరైన పత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్ కు తరలించారు.శాంతి భద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణ దృష్ట్యా "కార్డన్ అండ్ సెర్చ్" ఆపరేషన్ నిర్వహించినట్టు తెలిపారు.ఏవైనా అత్యవసర పరిస్థితులు,అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే 100 లేదా 112 కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు.ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన,చట్టాన్ని అతిక్రమించి దౌర్జన్యాలు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. ప్రజల భద్రత, నేర నియంత్రణ దృష్ట్యా ఈ తనిఖీలు నిర్వహించామని,చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## నాడు ఋషికొండ కోసం గగ్గోలు పెట్టి ఇప్పుడేం చేస్తున్నారు

**నేడు సింహాచలం భూముల జోలికి ఎందుకు వస్తున్నారు**

**ఋషికొండను టచ్ చేసిన వైసీపీ ఏం అయిందో తెలియదా..?**

**తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్**

**విశాఖపట్నం: (జయ జయహే)**

500 ఉద్యోగాలకు మాత్రమే పరిమితం అయ్యే గూగుల్ డేటా సెంటర్ కోసం కూటమి ప్రభుత్వం నానా ఆర్భాటం చేస్తోందని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ ఆరోపించారు. చివరకు దేవుడి భూములను కూడా గూగుల్ డేటా సెంటర్ కోసం సేకరించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఇదే అంశమై పెందుర్తి శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబును ఆయన క్యాంపు కార్యాలయం పెందుర్తిలో మంగళవారం కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ.. గతంలో వైసీపీ పరిపాలనలో ఉన్నప్పుడు ఋషికొండ ఎంతో పవిత్రమైనదని, అక్కడ ఋషులు తపస్సు చేసుకునే వారని, అటువంటి పవిత్రమైన కొండను తవ్వడం అపవిత్రమని అప్పట్లో ఘోషించిన వారు ఇప్పుడు చేస్తున్న పని ఏమిటి అని ప్రశ్నించారు? సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహస్వామి చెందిన భూములను గూగుల్ డేటా సెంటర్కు కట్ట పెట్టేందుకు ప్రయత్నాలు చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. నాడు ఋషులు తపస్సు చేసుకునే కొండను టచ్ చేసిన వైసీపీ ప్రభుత్వం గతి ఏమైందో అందరికీ తెలిసిందేనని ప్రస్తావించారు. మరి సింహాచలం వారాహ లక్ష్మీ నృసింహ స్వామి భూముల జోలికి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో పాలకులే అంచనా వేసుకోవాలని హితవు పలికారు.


# జీవితంలో తొమ్మిది రుణాలు తీర్చుకోవాల్సిందే

# అదే కర్మ సిద్ధాంతం

**(పుట్టా శ్రీనివాసరావు)**

**మానవ జీవితంలో ప్రతి మనిషికి పూర్వజన్మ కృతమైన వాటివల్ల పుణ్య, పాప విశేషములు ఈ జన్మలో ఆయా సమయాలలో అనుభవిస్తారు. ఇది కర్మ సిద్ధాంతం. మనది కర్మభూమి కాబట్టి ఆయా సందర్భాలను అనుసరించి దైవారాధన చేయుట వల్ల సంచిత కర్మల నుండి విముక్తిని పొందవచ్చు.**

**మానవులు ఎల్లప్పుడూ పితృఋణం, మాతృఋణం, పుత్రికా ఋణం, స్త్రీ ఋణం, సోదర ఋణం, దైవఋణం, ఋషిరుణం, దానఋణం, గురు ఋణం ఈ తొమ్మిది ఋణాలను తెలిసి కానీ తెలియక కానీ తీర్చకపోతే ఎల్లప్పుడూ ఋణబాధలు వేధిస్తూ ఉంటాయి. ఉన్నత స్థితి కలుగదు.**



**తల్లి ఋణం**

తల్లితో విభేదాలుంటాయి. వీరు తల్లిని బాధించకూడదు. పేదవారికి పాలు, బియ్యం, దానం చేయుట వల్ల మేలు జరుగుతుంది.

**పితృఋణం :-**

తల్లితండ్రులు గతించినచో వారికి చేయవలసిన కర్మలను సకాలంలో ఆచరించకపోవటం వల్ల విద్య, ఉద్యోగం. వ్యాపార అభివృద్ధి ఉండదు.

**పుత్రికాఋణం :-**

పుత్రికను బాధించటం, కూతురు ఆస్తిని అనుభవించటం వల్ల అవమానాలు, ధననష్టం, ఒంటరి జీవితం కలుగుతాయి.

**స్త్రీ ఋణాలు :-**

పరస్త్రీలను వ్యామోహించి బాధించటం, సంగమించటం, వారిని వదిలివెయ్యటం, తరచు గుర్తుచేసి దుర్మార్గంగా బాధించటం, భార్యను బాధించటం, కొట్టడం, ఆమెను పస్తులుంచటం, ఆమెను బయటకు గెంటివేయుట, నిందలు ప్రచారం చేయుట, పరస్త్రీలను బల్కారించటం, కామవాంఛలకు గురిచేయటం, మధ్య వయసు నుండి అకాల మరణ భయం, దారిద్ర్యం కలుగుతాయి. గర్భవతులను కూడా బాధించరాదు.

**సోదర ఋణం :-**

తన రక్త సంబంధీకుల ధనం వాడుకోవటం వారిని బాధించటం, వారి ఆస్తులను సక్రమంగా పంచక తానునుభవించుట మోసం చేయుట వీటివల్ల కొంతకాలానికి తన పిల్లలు దరిద్రం అనుభవిస్తారు. మనఃశ్శాంతి ఉండదు. జీవిత చరమాంకంలో దీనస్థితి కలుగుతుంది. వంశక్షయం కలుగుతుంది.

**దైవ ఋణం :-**

దైవాన్ని నిందించుట, జంతుహింస చేయుట, దేవాలయ ఆస్తులను అనుభవించుట వీటివల్ల సంతాననష్టం ఉంటుంది. అంగవైకల్యం కలిగిన సంతానం కలుగుతారు. శారీరక బలహీనత కలుగుతుంది.

**ఋషి ఋణం :-**

తమ వంశ ఋషిని సేవించలేకపోవటం, సాధు సన్యాసుల పట్ల తెలిసో తెలియక అమర్యాదగా ప్రవర్తించుట, ఋషిప్రోక్తమైన మంత్రాలను అవహేళన చేయుట వల్ల కలుగుతుంది.

దీనివల్ల మూర్ఖత్వం, ఆవేశం, సౌఖ్యలేమి కలుగుతుంది.

**దాన ఋణం :-**

ఒకరికి దానం చేస్తానని చేయకపోవుట – దానం చేసి ప్రతిఫలం కోరుట, చేసిన దానిని తిరిగి తీసుకొనుట వల్ల ఈ ఋణం ఏర్పడుతుంది. ఇటువంటి వారు తరచు వివాదాలకు గురవుతూ ఉంటారు. వ్యసన పీడ కలుగుతూ అపకీర్తి కలుగుతుంది..

**గురు ఋణం :-**

గురువులను దూషించుట, అంతకుసమానమైన వారిని నిందించుట. దీనివల్ల మిత్రభేదం, ఉపాధి కోల్పోవుట, ఋణ బాధలు కలుగుతాయి.

ప్రతినిత్యము తల్లితండ్రుల సేవ చేయుట వల్ల సమస్త గ్రహబాధలు తొలగిపోతాయి. ఈ తొమ్మిది రుణాలు విధిగా తీర్చుకోవాలని ,తద్వారా జీవితం సుఖమయం కాగలదని సిద్ధాంత కర్త సర్వేశ్వరరావు సూచిస్తున్నారు.

# దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న భవ్య పథకం

**(సి.హెచ్.ప్రతాప్)**

**భారత దేశాన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన భవ్య దేశవ్యాప్తంగా విశేష చర్చకు దారి తీస్తోంది. ఉపాధి అవకాశాల పెంపు, పారిశ్రామికాభివృద్ధి, యువత సాధికారత, గ్రామీణ--పట్టణ సమతుల్య అభివృద్ధి లక్ష్యాల ఆధారంగా రూపొందిన ఈ కార్యక్రమం భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపిస్తోంది.**




ఈ పథకానికి ప్రారంభ దశలోనే రూ.33,600 కోట్ల భారీ పెట్టుబడిని కేంద్ర ప్రభుత్వం కేటాయించడం దాని ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తోంది. దేశవ్యాప్తంగా పరిశ్రమలకు అనుకూల వాతావరణాన్ని సృష్టించడం, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడం, దేశీయ ఉత్పత్తిని పెంచడం ఈ పథక ప్రధాన ఉద్దేశ్యాలు. ముఖ్యంగా తయారీ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా "ఆత్మనిర్భర్ భారత్" లక్ష్య సాధనకు ఈ పథకం కీలకంగా మారనుంది.

భవ పథకం కింద దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 100 "ప్లగ్ అండ్ ప్లే" పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పార్కుల ప్రత్యేకత ఏమిటంటే పరిశ్రమలు ప్రారంభించడానికి అవసరమైన విద్యుత్, నీరు, రహదారులు, గిడ్డంగులు, డిజిటల్ కనెక్టివిటీ వంటి మౌలిక వసతులు ముందుగానే సిద్ధంగా ఉండటం. దీనివల్ల పరిశ్రమల స్థాపన వేగవంతమవడంతో పాటు పెట్టుబడిదారులకు సమయం, వ్యయం గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది.

ప్రస్తుతం దేశంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య మౌలిక వసతుల కొరత. భవ్య పథకం ద్వారా ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ సంస్థలు, తయారీ రంగంలోకి అడుగుపెట్టే కొత్త సంస్థలకు ఈ పార్కులు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పారిశ్రామికీకరణకు ఈ పథకం దోహదపడుతుంది.

ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 15 లక్షల మంది లబ్ధిదారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం పొందనున్నారని అంచనా. పరిశ్రమల ఏర్పాటుతో భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు సృష్టించబడటంతో యువతకు ఉద్యోగాలు అందే అవకాశాలు పెరుగుతాయి. అలాగే స్థానిక వ్యాపారాలు, రవాణా, సేవా రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయి. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు పెరగడంతో ఆర్థిక స్వావలంబనకు మార్గం సుగమమవుతుంది.

పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని హరిత పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా ఈ పథకంలోని మరో ముఖ్యాంశం. సౌరశక్తి, హరిత ఇంధనం, విద్యుత్ వాహనాల తయారీ వంటి రంగాలకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా భవిష్యత్తు అవసరాలకు అనుగుణమైన పారిశ్రామిక వాతావరణాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

సమగ్ర అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, ఉపాధి సృష్టి అనే లక్ష్యాలతో అమలవుతున్న భవ్య పథకం దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది వేస్తోంది. భారీ పెట్టుబడులు, ఆధునిక పారిశ్రామిక పార్కులు, లక్షలాది లబ్ధిదారులతో ఈ పథకం నిజంగా దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది.

# రైతు బజార్‌ను ప్రారంభించిన చేసిన ఎమ్మెల్యే కొణతాల





**అనకాపల్లి మే 25 జయ జయహే.**

రైతులు శ్రేయస్సు దృశ్య చుట్టుపక్కల రైతుల పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో భాగంగా రైతు బజార్ ఏర్పాటు శ్రీకారం చుట్టారు స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన రైతు బజార్ ను మంగళవారం ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ శాఖ మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు ఈ నూతన రైతు బజార్ ఏర్పాట్లు విషయంలో రైతులకు కొనుగోలుదారులకు, ప్రజలకు అందుబాటులో ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది అని అందుకే ఈ రోజున రైతు బజార్ అట్టహాసంగా ప్రారంభోత్సవం చేయడం జరిగిందని దేశవ్యాప్తంగా బెల్లం నెంబర్ వన్ మార్కెట్ అనకాపల్లి ఉండేదని దురదృష్టశాత్తు గిట్టుబాట్లు ధర లేక చెరుకు రాక వ్యవసాయం తగ్గిందని అది పెంపొందించేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్ట్ అఫీషియల్ ఇంటిలిజెన్సీ డేటా సెంటర్ వాడుకొని వ్యవసాయం ఉత్పత్తి పెంపొందించే విధంగా అడుగులు వేయాలని ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ స్కూలు ఒకటి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్స్ ద్వారా చెరుకు వ్యవసాయం మోడల్గా తీసుకొని పండించాలనుకుంటున్నామని ఆయన అన్నారు విశాఖలో పూర్ణ మార్కెట్ల ల అనకాపల్లి మార్కెట్ అభివృద్ధి చెందాలని విశాఖ జిల్లా అంతట నుంచి రైతులు ఇక్కడ వ్యాపారం చేసుకోవచ్చని రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రోత్సాహం అందిస్తున్నారని రైతులు ప్రకృతి వ్యవసాయం చేసే వాళ్లకు కూడా ఇక్కడ ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు కూరగాయల పంటలపై రసాయన వాడటం వల్ల పెద్దలుకు, పిల్లలుకు పంటల చల్లిన మందు ప్రభావం ప్రజలకు చెడు ప్రభావం చూపించి అనారోగ్యాలు గురవుతున్నారని ప్రతి ఒక్కరు సేంద్రియ ఎరువులతో పంటలు పండించాలని ఆయన అన్నారు మన ఇళ్లల్లో పెరట్లో వ్యవసాయం చేసి కాయగూరలు పండించుకోవాలని ఆయన సూచన చేశారు ఈ మార్కెట్ కి వచ్చే రైతులకు అన్ని విధాల ప్రోత్సాహం అందించాలని ప్రజలు అందరూ సహకరించాలని ఆయన సూచన చేశారు ఈ కార్యక్రమంలో ఏపీయూఎఫ్ ఐ డిసి చైర్మన్ పీల గోవింద సత్యనారాయణ గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరన్ వ్యవసాయం మార్కెట్ కమిటీ ఏడి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చి కోరా రాము, వైస్ చైర్మన్ కర్రీ వెంకట సత్యనారాయణ స్టేట్ కాపు డైరెక్టర్ ఇతర అధికారులు రైతులు కూటమి నాయకులు ప్రజలు పాల్గొనడం జరిగింది




## గొర్రెలు, మేకలు పెంపకం దారుల నూతన కార్యవర్గం

**బుచ్చయ్య పేట జయ జయహే**

బుచ్చయ్యపేట మండలంవడ్డాది శ్రీ మోదమాంబ గొర్రెలు, మేకలు పెంపకదారుల సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి.ఎన్నికల అధికారిగా కింతలి ప్రభుత్వ పశు వైద్యాధికారి కే.నాగ శివకుమార్ వ్యవహరించారు.సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా రాజాన శ్రీను,జోగా రమణ, ఉపాధ్యక్షులుగా కొర్ని బుజ్జి, డైరెక్టర్లుగా మొల్లి హరిబాబు, ఎలమంచిలి అప్పారావు, మిస్క సోమ నాయుడు, కురం దాసు నాయుడు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమకు ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు.గొర్రెలు,మేకలు పెంపకం దారుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. సభ్యులందరికీ ప్రభుత్వ రాయతీలు రుణాలు సంక్షేమ పథకాలు అందేలా పనిచేస్తామన్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.



## ఎల్ఈడి లైట్లతో ప్రయాణం ప్రమాదమే

### ద్విచక్ర వాహనాలకు కానరాని బ్లాక్ స్టిక్కర్

### రాత్రుళ్ళు తేలికపాటి వాహనాలు ప్రయాణాలు నరకమే

**టెక్కలి మే 26 జయ జయహే**

రాత్రుళ్ళు రహదారుల్లో ద్విచక్ర వాహనాలు ఆటోలు తేలికపాటి వాహనాల ప్రయాణాలు నరకయాతనగా మారుతుంది, ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొని ఉన్నాయి, ఎదురుగా వస్తున్న వాహనాల వెలుతురుతో ద్విచక్ర వాహనదారులు, ఆటోల ప్రయాణం మసక చీకటిలో ప్రయాణం ప్రమాదాలు తెచ్చిపెడుతున్నాయి, ఇటీవల పలు రహదారుల్లో పాదచారుల ద్విచక్ర వాహనదారుల ఆటో ల. ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలకు ముఖ్య కారణం ప్రతి ద్విచక్ర వాహనం ఆటోలు తేలికపాటి వాహనాలు రాత్రి వేళల్లో ఎల్ఈడి లైట్లు వాడకం వల్లే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని మోటారు వాహనాల నిపుణులు వాహనదారులకు స్పష్టం చేస్తున్నారు. అతిగా సూటిగా కళ్ళల్లోకి ఫోకస్ వెలుతురు పడడం వల్ల ఆకస్మిక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు తప్పనిసరిగా తలకు హెల్మెట్ ల తోపాటు తమ వాహనాల హెడ్ లైట్స్ కు సగం బ్లాక్ స్టిక్కర్ కచ్చితంగా అతికించి వాహనాలను నడపాలని సంబంధిత రవాణా శాఖల అధికారులు హెచ్చరించినప్పటికీ వాహనాల వినియోగదారులు నిర్లక్ష్య వైఖరికి ఎన్నో ప్రాణాలు బలై తీవ్ర గాయాల పాలవుతున్నారని చెబుతున్నారు. ద్విచక్ర వాహనాలతో ప్రమాదాలు రాత్రి వేళల్లో నివారించడానికి సాధారణ హెడ్ లైట్స్ వాడాలని ఆర్టీవో అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపి ఖచ్చితమైన విధానాలతో ఎల్ఈడి బల్బులను నిషేధించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



## విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ తక్షణమే ఏర్పాటు చేయాలి

### సైనిక్ నగర్ లో వోల్టేజ్ సమస్యను తీర్చాలి

**టెక్కలి. మే 26 జయ జయహే**

టెక్కలి పట్టణంలో ఆనుకుని ఉన్న తొలుసూరు పల్లి పంచాయతీ పరిధిలోని సైనిక్ నగర్ లో చాలా కాలం నుంచి విద్యుత్ లో వోల్టేసి తీవ్రమైన సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని సుమారు రెండు వందల కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయని తక్షణమే లో వోల్టేజీ సమస్యను తీర్చే విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని టెక్కలి మండల బిజెపి అధ్యక్షులు జార్జాన రామ్ జీ తెలిపారు. ట్రాన్స్ఫారం గూర్చి ఇదివరకు ప్రతిపాదనను చేసినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదని రాంజీ అన్నారు, ఈ మేరకు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహ కుమార్ కు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో ఏఈ మురళీ మోహనరావు కు విజ్ఞప్తి చేశారు, రాంజీ తో పాటు స్థానికలు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన మత్స్యకారులకు. బోట్లు వలలు ఇప్పించండి

### బోట్లపై నుండి వినూత్న నిరసనతో గిరిజన మత్యకారులు

**అనంతగిరి జయ జయహే**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం చిలకల గడ్డ పంచాయతీ మెట్టపాలెం గ్రామంలో ఆదివాసీ గిరిజన మత్స్యకారులు గత 50 సంవత్సరాల నుండి తాటిపూడి రిజర్వాయర్ లో భూములు కోల్పోయారు . అప్పటినుండి నేటి వరకు. గోస్తని గెడ్డలో చేపల వేట పై ఆధారపడి జీవిస్తున్నారు రైతు భరోసా మరియు . జిరాయితి భూమిలే లేవు. ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం లేదు. తుఫాన్ సమయంలో బోట్లు, వలలు కొట్టుకుపోతే ఎటువంటి నష్టపోయారు ఇవ్వడం లేదని తెలిపారు 2023 సంవత్సరంలో ఐటీడీఏ పీవో గ్రామానికి వచ్చి 30 బోట్లు వలలు ప్రభుత్వం ద్వారా ఇప్పిస్తామని చెప్పారు. తాటి పూడి రిజర్వాయర్లో బోటు షికారు కూడా చేశారు. నేటికీ సంవత్సరాలు గడుస్తున్నా బోట్లు వలలు ఇవ్వలేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మా గ్రామస్థులకు సహాయం అందించి బోట్లు వలలు ఇప్పించాలని వినూత్నంగా బోట్లుపై నిల్చోని చేతులు జోడించి నమస్కరిస్తూ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి శోభ మధు కిల్లి దేముడు శోభ గోపి. శోభం కుమార్. తదితరులు పాల్గొన్నారు



## అలరించిన హరికథా మరియు సంగీత కార్యక్రమం

**సంజామల (జయ జయహే)**

సంజామల మండలం, పేరుసోముల గ్రామంలో వెలసిన సుప్రసిద్ధ శ్రీ విష్ణుకంటి క్షేత్రం 16వ వార్షికోత్సవాలలో భాగంగా రెండవరోజు తిరుమల తిరుపతి దేవస్థానములు అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు వై. రమేశ్ బాగవతార్ చే హరికథా, పి. వి. రమణమూర్తిచే సంగీత కార్యక్రమం నిర్వహించారు. సహకార వాయిద్యాలుగా యం. బాలస్వామి కీబోర్డు, పి. ఆనంద్ బాబు తబలా సహకారం అందించారు. అంతకుముందు ఇస్కాన్ ధర్మ ప్రచారకులు శ్రీనిత్యతృప్తదాస్ స్వామిచే భగవద్గీత ప్రవచనం, నంద్యాల భక్తబృందంచే విష్ణు సహస్రనామ పారాయణం, అన్నకూటోత్సవం తదితర కార్యక్రమాలు పీఠాధిపతి శ్రీ రామ్మోహన్ స్వామి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డితో పాటు స్వామివారి శిష్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఈ నెల 31న 'శిష్టకరణం ఫౌండేషన్' ప్రతిభా పురస్కారాల ప్రధానం

**విశాఖపట్నం: (జయ జయహే)**

పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు ఈ నెల 31న 'శిష్టకరణం ఫౌండేషన్' ప్రతిభా పురస్కారాలను అందజేయనుంది. విశాఖపట్నంలోని ప్రేమ సమాజం ఏసీ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుంది. తొలుత శనివారం నిర్వహించాలనుకున్నా, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఆదివారానికి మార్చినట్లు నిర్వాహకులు మానాపురం సురేష్ కుమార్, వేణుం వీరబాబు, మరడాం రవికాంత్, శేఖరమంత్రి శ్రీనివాసరావు తెలిపారు.



## భారీ ఇదురు గాలికి ఎగిరిపడిన స్కూల్ పై కప్పు

**అనంతగిరి/జయ జయహే**

అల్లూరి జిల్లా అరకు నియోజకవర్గం అనంతగిరి మండలంలోని పినకోట పంచాయతీ పరిధిలోని ఈ దురుగాలులతో కురిసిన భారీ వర్షం కారణంగా రాచకీలం గ్రామం ప్రభుత్వ ఎంపీపీ స్కూల్ పై కప్పు రేకులు ఎగిరిపోవడం తో వర్షం లో స్కూల్ మొత్తం పూర్తిగా కొట్టుకొని పోయిందని వాపోయారు. కావున వచ్చే నెల జూన్ లో పాఠశాలలు ప్రారంభం అవుతున్నాయి కావున ఈ పాఠశాల భవనాన్ని తక్షణమే ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరారు. విద్యార్థులు విద్యాబోధన కోసం తీవ్ర ఇబ్బంది పడే పరిస్థితి ఉందన్నారు.



## మన రిజిస్ట్రేషన్ - మన బాధ్యత

**నర్సీపట్నం - జయ జయహే :**

రిజిస్ట్రేషన్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి మన రిజిస్ట్రేషన్ మన బాధ్యత కార్యక్రమం ఎంతగానో ప్రజలకు దోహదపడుతుందని రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ కే.మన్మధరావు పేర్కొన్నారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మన రిజిస్ట్రేషన్ మన బాధ్యత కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా రిజిస్ట్రార్ కే. మన్మధరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగం ఖచ్చితత్వం పారదర్శకత అనే లక్ష్యంతో శాఖ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజల సందేహాల నివృత్తి, ప్రజల నుంచి సలహాల స్వీకరణ, సేవల వికేంద్రీకరణ, ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సమస్యల పరిష్కారం వైపు అడుగులు వేయడమే లక్ష్యంగా రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ ముందుకు సాగుతోందన్నారు. అనకాపల్లి జిల్లాలో ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసి, పారదర్శకంగా అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రొటేషన్ పద్ధతిలో మన రిజిస్ట్రేషన్ మన బాధ్యత కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకొని తమ సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు , సీనియర్ అసిస్టెంట్ విజయ్ , జూనియర్ అసిస్టెంట్ చక్రి , గంగాధర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సీఎం వై.యస్ జగన్‌ను కలిసిన కె.కె రాజు

**తాడేపల్లి (జయ జయహే)**



వైస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె రాజు ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లాలో కూటమి ప్రభుత్వం చేస్తున్న భూదోపిడిలు మరియు అక్రమాలుపై ప్రశ్నిస్తున్న పలువురు వైసీపీ నాయకులు మరియు సోషల్ మీడియా సైనికులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేసి వేదిస్తున్న తీరును మరియు పలు అంశాలపై చర్చించారు.

# బీసీలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు

### గతంలో తోలు తీస్తాం...తోకలు కత్తిరిస్తాం...అన్న బాబు

### ఆ మాటలు గుర్తు తెచ్చుకుంటున్న మత్స్యకారులు

### వైసీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్

**విశాఖపట్నం, మే 26, జయ జయహే**

బీసీకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు మాటలు నమ్మకూడదని అందుకు ఇటీవల "మత్స్యకారుల సేవలో" పథకం కాదు అది "మత్స్యకారులు లోకువ" అనే పథకం పెట్టి మోసగించారని వైసీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ అన్నారు. విశాఖపట్నం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 1,30,796 మందికి పైగా మత్స్యకార



కుటుంబాలకు మొత్తం రూ. 261.59 కోట్ల నిధులను విడుదల చేసింది అని ఏపీ ప్రభుత్వం లెక్కల చెబుతుంది కానీ నేటికి కూడా చాలామంది మత్స్యకార సోదరుల అకౌంట్లో ఆ మొత్తం జమ కాలేదన్నారు. వారందరికీ ఈ పథకం వర్తింప చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిజంగా ప్రాణాలు పణంగా పెట్టి సముద్రంలో వేటకు వెళ్లే కూలీల కంటే, కేవలం కాగితాలపై బోట్లు చూపించే యజమానులకే లబ్ధి చేకూరుతోందని జాలర్ల సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయన్నారు. విశాఖ జిల్లాలో 3000 వరకే లబ్ధిదారులు ఉన్నారని చూపిస్తూ వారికి కూడా పూర్తిస్థాయిలో నగదు జమ చేయకపోవడం ఈ కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. చేపల వేట నిషేధం ప్రారంభమై ఇప్పటికే 40 రోజులు గడుస్తున్నా మత్స్యకార కుటుంబాలు ఏవిధంగా బతకాలని ప్రశ్నించారు. ఏప్రిల్ 15 నుండి జూన్ 14 వరకు 61 రోజుల పాటు వేట నిషేధం అమల్లో ఉంటుందని, ఈ నిషేధ కాలం ప్రారంభంలోనే డబ్బులు చేతికి అందితే జాలర్ల ఇల్లు గడుస్తుంది. కానీ ప్రభుత్వం మే నెల చివరి వారంలో నిధులు విడుదల చేయడం వల్ల నిషేధ కాలంలో సగం రోజులు మత్స్యకారులు అప్పులపాలవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్య శాఖ మంత్రి అచ్చం నాయుడుకు మత్స్యకారులు గోడు వినిపించడం లేదా...వారం రోజుల్లో లబ్ధిదారులందరికీ వారి అకౌంట్లో ప్రభుత్వం నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మత్స్యకార సంఘాలన్నీటిని కలుపుకొని మంత్రి అచ్చం నాయుడును విశాఖ జిల్లాలో అడ్డుకోవడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో 18 వ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కళ్యాణ్, నియోజకవర్గ బీసీ అధ్యక్షులు పోతిబంతి హరికృష్ణ, బొండాడ వెంకటరమణ , మత్స్యకార నాయకులు కంటుముచ్చు సాగర్, చేపల నూకరాజు (బుడ్డి) తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చికుక్క స్వైర విహారం

### ఏడుగురికి తీవ్ర గాయాలు

### చిన్నారులను వృద్ధురాలును వెంటాడిన కుక్క

**బుచ్చయ్యపేట జయ జయహే**



బుచ్చియ్యపేటలో మంగళవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఏడుగురుని తీవ్రంగా గాయపరిచింది.వీరిలో ఐదుగురు చిన్నారులు ఓ వృద్ధురాలు కూడా ఉన్నారు.రోడ్డుపై వెళ్తున్న వారిని, ఇంట్లో ఉన్నవారిని కుక్క వెంటాడి కరిచింది. బుచ్చయ్య పేటకు చెందిన సాలాపు సుమ(7),పోలిమరక వినోద్(6), పడాల హన్సిక(7),చంద్రిక(6),సీరా కుసుమ(19), దిబ్బిడికి చెందిన సేనాపతి అఖిల్(5) తీవ్రంగా గాయపడటంతో స్థానిక ఆసుపత్రి లో ప్రథమ చికిత్స అనంతరం 108లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.కందిపూడికి చెందిన కోమటి పైడమ్మ(70)కు బుచ్చయ్యపేట ఆసుపత్రి లోనే చికిత్స అందిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.పిచ్చికుక్క స్వైర విహారంతో బుచ్చయ్యపేట పరిసర గ్రామాల ప్రజలు తీవ్రభయాందోళన చెందారు.చివరికి బుచ్చియ్యపేటలో స్థానిక యువకులు పిచ్చికుక్కను హతమార్చారు.



# వడ్డాదిలో గాలివానతో బీభత్సం

**బుచ్చయ్య పేట జయ జయహే**

పెద్ద ఎత్తున వీచిన గాలులకు చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. పలుచోట్ల ఫ్లెక్సీలు,బ్యానర్లు ఎగిరిపోయాయి. పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభాలపై పడటంతో ఎక్కడికక్కడ విద్యుత్తు సరఫరా నిలిచి పోయింది.వడ్డాది కొత్తూరులో ఒక విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్, ఐదు విద్యుత్ స్తంభాలు నేల కూలాయి.స్తంభాలు విద్యుత్ తీగలు కొత్తూరులో రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. ఇళ్లల్లో ఉన్న ఫ్యాన్లు,విండో గ్లాసులు విరిగిపోయాయి. కొత్తూరు శివాలయం వద్ద పార్కింగ్ చేసి ఉన్న ఆటో గాలి బీభత్సానికి ఎగిరి బోల్తా పడింది.అరగంట సేపు గాలివాన వడ్డాది కొత్తూరులో బీభత్సం సృష్టించింది. లబ్బీపేటలో ఒక ఇనుప చట్రాల హోర్డింగ్ ఎగిరిపోయి విద్యుత్తు తీగలపై పడింది.పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. విరిగిన చెట్లు,నేల కూలిన విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు విద్యుత్ సిబ్బంది రంగంలోకి దిగారు.ఎడిఈ సురేష్ కుమార్,ఏఈ వెంకట రమణ, లైన్ మేన్ వెంకటేశ్ ఘటనా స్థలాలను పరిశీలించారు.అనంతరం ఎమ్మెల్యే రాజు కూడా నేల కూలిన విద్యుత్ స్తంభాలను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు.



# గోదావరి కాలుష్యంపై పవన్ ఫైర్

### "పుష్కర స్నానాలు కాదు.. రోగాలు వస్తాయి" అంటూ మంత్రి, అధికారులపై ఆగ్రహం

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

గోదావరి నది కాలుష్యంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లోని జిల్లా కాలువను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన, కాలుష్య జలాలు నేరుగా గోదావరిలో కలుస్తున్న పరిస్థితిని చూసి మంత్రి కందుల దుర్గేష్ తో పాటు అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.కాలువలో ప్రవహిస్తున్న మురుగునీరు, చెత్త, కలుషిత వ్యర్థాలు గోదావరిలో కలుస్తున్నాయని గమనించిన పవన్ కళ్యాణ్, "ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు గోదావరిలో స్నానం చేస్తే పుణ్యం కాదు, రోగాలు వస్తాయి" అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. "ఇంకా దీనిని పుష్కర స్నానాలు అంటామా? ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తూ ఎలా ప్రచారం చేస్తారు?" అంటూ అధికారులను నిలదీశారు.ప్రత్యేకంగా పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వైపు తిరిగి, "మీ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు ఇవేనా? ఇంత తీవ్ర స్థాయిలో కాలుష్యం ఉన్నా ఇప్పటివరకు ఎందుకు స్పందించలేదు?" అంటూ ప్రశ్నించారు. నదీ పరిరక్షణపై సమన్వయం లేకపోవడం, కాలుష్య నియంత్రణ చర్యలు కనిపించకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.అధికారులను ఉద్దేశించి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, "ప్రజలు తిరగబడితే తప్ప స్పందించరా? ముందుగా సమస్యను గుర్తించి పరిష్కారం చూపాల్సింది మీ బాధ్యత" అంటూ హెచ్చరించారు. కాలుష్యానికి కారణమవుతున్న డ్రైనేజీ వ్యవస్థ, పరిశ్రమల వ్యర్థాలు, మురుగు నీటి ప్రవాహాలపై వెంటనే సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు.గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో నదీ పరిశుభ్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కాలుష్య నివారణకు తక్షణ చర్యలు చేపట్టకపోతే ప్రజా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. గోదావరి పవిత్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

# దేశంలో అసహజ జనాభా మార్పు

### హోంమంత్రి అమిత్ షా వెల్లడి

**జయ జయహే**

అక్రమ వలసలు, ఇతర కారణాలతో దేశంలో చోటుచేసుకుంటున్న 'అసహజ జనాభా మార్పు'పై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ 2025 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్టు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. ఈ కమిటీకి రిటైర్డ్ జడ్జి ప్రకాష్ ప్రభాకర్ నావోలేకర్ అధ్యక్షత వహిస్తారని, మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారని అమిత్‌షా తెలిపారు. కమిటీ మెంబర్‌గా హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ఉంటారని చెప్పారు. దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న జనాభా మార్పులపై కమిటీ సమగ్ర మూల్యాంకనం చేసి పరిష్కారం సూచిస్తుందని అమిత్‌షా తెలిపారు.

# ప్రజా సేవలోనే విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్

### వైస్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

**చోడవరం : మే 26 జయ జయ హే**

ప్రజా సేవలోనే పునరంకితమవుతూ,.. ఖాతాదారులకు నాణ్యమైన, నమ్మకమైన వాణిజ్య సేవలను అందించేందుకే విశాఖ కో- ఆపరేటివ్ బ్యాంకు ఏర్పడిందని వైస్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. స్థానిక సాయిదేవి ఫంక్షన్ హాలు లో మంగళవారం నిర్వహించిన విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు చోడవరం బ్రాంచి సర్వ సభ్య సమావేశానికి వైస్ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చోడవరం బ్రాంచి మేనేజర్ జి.వి.సాయిరామ్ మూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వైస్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఈ బ్యాంకు మహా జనసభ మీది, బ్రాంచి సభ్యులకు జవాబుదారీతనంగా లావాదేవీలన్నింటిని తెలియజేశారు. చోడవరం బ్రాంచి పరిధిలోని మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, చోడవరం మండలాల నుండి 2025-26 ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి మొత్తం 1782 సభ్యులకు గాను వారి నుండి చేకూర్చిన షేరు ధనం రూ. 3,11,81,500 ల కు చేరుకుంది అన్నారు. బ్రాంచి పరిధిలో సుమారు రూ. 28.18 కోట్లు డిపాజిట్లు సేకరించగా, వివిధ రుణాలు





క్రింద రూ. 63.59 కోట్లు అందజేసామన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 11 మంది సభ్యులు మరణించగా వారి కుటుంబాలకు రూ. 93,500 చెల్లించామని, 12 మంది సభ్యులకు వైద్య ఖర్చుల నిమిత్తం సుమారు రూ. 3,20,211 రూపాయలు చెల్లించినట్లు తెలియజేశారు. సభ్యుల పిల్లలకు విద్యార్థి ప్రతిభా పుష్కారాలు నిమిత్తం 21 మందికి సుమారు రూ.1,30,000 లు అందజేసామన్నారు. వినియోగదారులు ఖాతాదారుల సేవలో ఏ.పి. లో 55 బ్రాంచీలు, తెలంగాణలో ఐదు బ్రాంచి లు ఉన్నట్లు తెలిపారు. విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు వివిధ బ్రాంచిల పరిధిలో సుమారు 11, 500 మంది సభ్యులు ఉండగా, వారి నుండి 45 కోట్లు డిపాజిట్లు సహకరించి ఖాతాదారులకు వాణిజ్యపరమైన సేవలు అందిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జి. జనార్ధన్ రావు, కార్యవర్గ సభ్యులు ఎం.వి గణేష్ కుమార్, జోనల్ మేనేజర్ కె.వి.చిన్నారావు, చోడవరం దేవరపల్లి చీడికాడ మాడుగుల మండలాలకు చెందిన బ్యాంక్ ఖాతాదారులు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.



# పాండవుల చెరువు పనులను పరిశీలించిన డ్వామా పీడీ

**మాడుగుల మే 26 జయ జయహే**

మాడుగుల మోదకొండమ్మ వారి ఆలయ సమీపంలో 50 లక్షల రూపాయలతో చేపట్టిన పాండవుల చెరువు అభివృద్ధి , ఆధునీకరణ పనులను మంగళవారం డ్వామా పిడి సిహెచ్ నిర్మల దేవి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. అలాగే సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ను ఆదేశించారు. పనులలో నాణ్యత లోపించరాదని సూచించారు. అలాగే పలుచోట్ల జరుగుతున్న ఉపాధి పనులు నీ ఆమె పరిశీలించి పని జరుగుతున్న ప్రదేశాలలో కల్పించవలసిన ప్రాథమిక సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా కూలీలకు అందుబాటులో మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, టెంట్లు వంటివి అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలన చేశారు. అలాగే కార్మికుల తో కూడా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి అప్పలరాజు, ఎండి ఓకే అప్పారావు, ఏపీఓ జి శ్రీనివాస్, ఏపీవో, ఈ సి జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అమ్మవారికి సారే సమర్పణ

**మాడుగుల మే 26 జయ జయహే**

మాడుగుల మోదకొండమ్మ వారి జాతర నేపథ్యంలో మంగళవారం గ్రామస్తులు పెద్ద ఎత్తున సారి సమర్పించారు. ప్రతి ఏడాది అమ్మవారికి భక్తులు సారే సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. మహిళలు ఇంట్లో తయారుచేసిన వివిధ రకాల పిండివంటలను ఊరేగింపుగా తీసుకువచ్చే అమ్మవారికు సమర్పించి వాటిని భక్తులకు ప్రసాదంగా అందజేస్తారు. అయితే ప్రతి ఏడాది ప్రతి వీధి నుంచి వేరువేరుగా ఈ కార్యక్రమాలు నిర్వహించేవారు. కానీ ఈ ఏడాది ఊరంతా కలిసి ఒకేసారి సారి సమర్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. వాతావరణం కూడా సహకరించడంతో భక్తులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి వివిధ రకాల పిండి వంటలతో కూడిన సారి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పి అప్పలరాజు, కమిటీ సభ్యులు ఎస్ఎస్ శ్రీనివాసరావు డి సూర్యారావు, పి బలరాం, పి క్రాంతి ,పి రాము తదితరులు పాల్గొన్నారు.



# మాడుగుల మండలానికి ఆర్వో ప్లాంట్ మంజూరు చేయించిన ఎంపీ

### స్థల పరిశీలన జరిపిన అధికారులు

**మాడుగుల మే 26 జయ జయహే**

అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సి.ఎం. రమేష్ మాడుగుల మండలంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు సురక్షిత మంచినీరు అందించేందుకు వివిధ గ్రామాల్లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు మంగళవారం అధికారులు మాడుగుల్లో ప్లాంట్ నిర్మాణానికి బిజెపి నాయకులతో కలిసి స్థల పరిశీలన జరిపారు. వాటిలో భాగంగా మండలంలో మాడుగుల,ఎం కోడూరు, కేజే పురం, ఒమ్మలి, కింతలి వల్లపురం, కొండయ్యపాలెం గ్రామాలకు ఈ సురక్షిత మంచినీటి పథకాలు మంజూరు చేశారు.ఈ పనులు త్వరలో మంజూరు కాగలవు. దీంతో మాడుగుల మండల బిజెపి అనకాపల్లి ఎంపీకి ధన్యవాదాలు తెలిపింది.



# స్వచ్ఛ రథం, ఐ వి ఆర్ ఎస్ కాల్స్‌పై అవగాహన

**మాడుగుల, మే 26, జయ జయ హే**

మాడుగుల మండలంలో ప్రతీ గ్రామ పంచాయతీ కి చెందిన ఇద్దరు డ్వాక్రా గ్రూపు మెంబర్ లకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ రథం, ఐ వీ అర్ ఎస్ కాల్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండిఓ కే అప్పారావు స్వచ్ఛ రథం ప్రాముఖ్యత గురించి వివరిస్తూ..గ్రామాలలో వీటిపై అవగాహన కల్పించి స్వచ్ఛ రథం నీ ఉపయోగించుకోవాలనిని సూచిశీచారు.అలాగే ఐ వి ఆర్ ఎస్ కాల్స్ గురించి కూడా వివరించారు.

# పారిశుద్ధ్య కార్మికులకు మధ్యాహ్నం పనులను నిలుపుదల చేయాలి

**చోడవరం మే 26 జయ జయహే**

చోడవరం మేజర్ పంచాయతీలో సుమారుగా 65 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఎండలు భగభగ మండిపోతున్న తరుణంలో విపరీతంగా వాతావరణంలో మార్పులు ఏర్పడుతున్న దృష్ట్యా పారిశుధ్య కార్మికులుకు మధ్యాహ్నం డ్యూటీలు నిలుపుదల చేయకుండా పనులు చేయిస్తున్నారనీభారత్ కమ్యూనిస్టు పార్టీ అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు మండిపడ్డారు. మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులతో నిరసన కార్యక్రమం చేపట్టి పారిశుధ్య కార్మికుల పట్ల అధికారులు చిన్నచూపు చూస్తున్నారని,కనీసం కార్మికులకు మంచినీళ్లు కానీ, నెత్తి మీద టోపీలు గాని సప్లై ఇవ్వకుండా కార్మికులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తూ పని చేయించుకుంటున్నారని మండిపడ్డారు. కనీసం కార్మికులకు ఆరోగ్యపరమైన అంశాలు గాని కనీస సదుపాయాలు ఏర్పాటు చేయడంలోనే అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. పంచాయతీ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ సకురు లక్ష్మి కి వినతిపత్రం ఇస్తూ పై అధికారులు కార్మికులకు మధ్యాహ్న పనుల్ని నిలిపిదలు చేయాలని అన్నారు ,కార్మికులకు ప్రమాదం జరిగితే పూర్తి బాధ్యత పంచాయతీ కార్యదర్శి అని, పారిశుధ్య



కార్మికులకు బట్టలు నూనెలు సబ్బులు జోళ్ళు సంవత్సరాల తరబడి ఇవ్వకుండా కార్మికుల్ని గోడ్డు చాకిరి చేయిస్తా ఉన్నారు పంచాయతీ అధికారులు వెంటనే మధ్యాహ్నం పనులను నిలుపుదల చేయాలని ఏఐటియుసి మండల కార్యదర్శి పోట్నూర్ అప్పారావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జలగడుగులు గణేష్, పొట్నూరు ఈశ్వరరావు, దుమ్ము అప్పారావు, జలగడుగులు నాగరాజు, కృష్ణ, కృప, మహాలక్ష్మి, పద్మ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



## క్రీడా సామాగ్రి పంపిణీ

**ఎస్.రాయవరం, మే 26:(జయ జయహే)**

ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం గ్రామంలో ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రీడా సామాగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు బంగారు చిట్టి యువ క్రీడాకారులకు వాలీబాల్, నెట్, ఫుట్‌బాల్, త్రోబాల్‌లను అందజేశారు. ఈ సందర్భంగా బంగారు చిట్టి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంత యువత మంచి క్రీడాకారులుగా ఎదిగి ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన సామాగ్రిని అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో గనగళ్ళ శ్రీను, అర్జిల్లి రాజు, స్థానిక క్రీడాకారులు పాల్గొన్నారు.




## నేటినుంచి టిడిపి మహానాడు

### వర్చువల్ విధానంలో రెండ్రోజుల పండగ

### పార్టీ నేతలతో చర్చించిన అధినేత చంద్రబాబు

**జయ జయహే**

టీడీపీ మహానాడు 2026 రెండ్రోజుల పాటు జరుగనుంది. బుధ,గురువారాల్లో ఈసారి పూర్తిగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. దీనిని వివిధ మాధ్యమాల ద్వారా ప్రసారం చేస్తారు. ఈ విషయాన్ని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు, గ్రామ స్థాయి కార్యకర్తలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహానాడు నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశర చేశారు. తెలుగువారు ఆసక్తిగా ఎదురు చూసే కార్యక్రమం మహానాడు అని, పార్టీకి అది ఒక భావోద్వేగమని సీఎం చంద్రబాబు అన్నారు. మహానాడు ద్వారా పార్టీ ప్రజలకు ఏ సందేశం ఇస్తుందో అన్న ఆసక్తి అందరిలో ఉంటుందని చెప్పారు. గతంలో కోవిడ్ సమయంలో కూడా డిజిటల్ పద్ధతిలో మహానాడు నిర్వహించామని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరోసారి వర్చువల్ విధానాన్నే ఎంచుకున్నామని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున వర్చువల్ రూపంలో మహానాడు నిర్వహించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 1845 క్లస్టర్ల పరిధిలో మహానాడు నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీ ఎదుగుదలకు, కార్యకర్తలు నాయకులుగా ఎదగడానికి క్లస్టర్ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. ఈసారి 'స్త్రీశక్తి' థీమ్‌తో మహానాడు నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయిలో జరిగే మహానాడులో రాష్ట్రస్థాయి నాయకులు కూడా పాల్గొంటారని సీఎం చంద్రబాబు తెలిపారు. మహానాడులో సరైన మార్గనిర్దేశర చేసుకుని వాటిని అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరిలో జవాబుదారీతనం ఉండాలని.. అప్పుడే ప్రజలు విశ్వసిస్తారని అన్నారు. పార్టీ కార్యకర్తలు అన్ని విధాలా సాధికారత సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి పునరంకితమయ్యేలా మహానాడును నిర్వహించుకుందామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.




## అర్హులంతా ఓటరు జాబితాలో ఉండాల్సిందే

### అనర్హుల పేర్లను మాత్రమే తొలగించాలి

### సర్ ప్రక్రియపై ఎన్నికల అధికారి ఆదేశాలు

**జయ జయహే**

భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పక్రియలో భాగంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అలాగే అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్ఏసీ) జి.ఎస్. చారిలతో కలిసి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిహెచ్‌ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, ఐఏఎస్, మేడ్చల్?మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. మను చౌదరి, ఐఏఎస్, సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు హాజరయ్యారు. మ్యాపింగ్ పక్రియ లో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. అలాగే పనివిధానంపై నిరంతరం సమీక్షిస్తూ, మ్యాపింగ్ పక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే అపార్టుమెంట్స్ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలపై ప్రత్యేక దృష్టి సారించి సర్ పక్రియ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మురికివాడలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. పక్రియను మరింత సరళీతరం చేయడానికి ఎన్యూమరేషన్ ఫారాలు ఆంగ్లం, తెలుగు భాషాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే ఓటర్ల మ్యాపింగ్ పక్రియ సక్రమంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పక్రియ నిర్వహణలో పాలుపంచుకుంటున్న క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రోత్సహించేందుకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అవార్డు అందజేయనున్నట్లు ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు.



## అనంత పద్మనాభ ఆలయ ప్రాశస్త్యాన్ని పెంచాలి

### త్రిదండి చిన జీయరు స్వామి

**పద్మనాభం, మే 26, జయ జయహే**

అనంత పద్మనాభ స్వామి ఆలయ ప్రాశస్త్యాన్ని పెంచేలా అభివృద్ధి చేయాలని త్రిదండి చిన జీయరు స్వామి అన్నారు. మంగళవారం అనంత పద్మనాభస్వామి వారిని దర్శించుకున్న అనంతరం కుంతీ మాధవస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మనాభం ఆలయాన్ని ప్రవచనకర్త శ్రీభాష్యం అప్పలాచార్యులు తనకు పరిచయం చేశారని, రాజగోపుర నిర్మాణం కోసం 40 ఏళ్ల క్రితం మెట్ల మార్గంలో కొండపైకి నడుచుకొని వెళ్లానని గుర్తు చేసుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఘాట్ రోడ్డును అందుబాటులోకి తెచ్చిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ను అభినందించారు. కొండ మీద శుభకార్యాలు, స్వామి సేవ కోసం కళ్యాణమండపం, పద్మనాభం మీదుగా వెళ్లే భక్తులకు దర్శనమిచ్చేలా భారీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని గంటాకు సూచించారు. రామానుజుల కాలంలో ఆలయాలు సమాజ ఏకతకు పాటుపడే ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉండేవని పేర్కొన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన జీయరు స్వామి రాకతో అనంత పద్మనాభస్వామి ఆలయం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బాధ్యతగా జీవించడమే ఆధ్యాత్మికతని ఉపదేశించిన గొప్ప వ్యక్తి చిన జీయరని తెలిపారు. కుల మత బేధం చూడని చిన జీయరు స్వామి, హైదరాబాద్ ముచ్చింతల్ లో సమతామూర్తి విగ్రహాన్ని నెలకొల్పిన ఆదర్శ వాదిగా పేర్కొన్నారు. తిమ్మాపురం వారిజ ఆశ్రమంలో వేద పాఠశాలతో పాటు అంధుల పాఠశాల కూడా నడపడం ప్రశంసనీయమన్నారు. అంతకుముందు అనంత పద్మనాభస్వామిని, కుంతీ మాధవస్వామిని చిన జీయరు స్వామి, గంటా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈఓ రాజు, నారాయణరెడ్డి, పార్టీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, కాళ్ల నగేష్ కుమార్, కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, కాళ్ల సత్యనారాయణ, కురుమిన లీలావతి, పావని, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## రైతు వెన్ను విరిచిన.. మరో రైతు

**గోకవరం జయ జయహే ప్రతినిధి**

గోకవరం మండలం తంటికొండ గ్రామంలో అడబాల సోమేశ్వరరావు, అడబాల వీర సత్యనారాయణ, అడబాల వీర్రాజు కు చెందిన సర్వే నంబర్ 320/4ఏ , 320/4సి , 318 వారికి చెందిన 8 ఎకరాల పామాయిల్ తోట పూర్తిగా అగ్నికి ఆహుతి అయిపోయింది. ప్రక్క రైతు నిర్లక్ష్యంగా వ్యవహరించి శనివారం సాయంత్రం తన తోటలో ఉన్న ఎండిపోయిన వాటిని నిప్పంటించడంతో. మేము నష్టపోయామని రైతు తమ ఆవేదన వ్యక్తం చేశారు. పామాయిల్ తోట తో పాటు దానికి ఉపయోగపడే సామాగ్రి పూర్తిగా మంటల్లో బూడిద అయిపోయాయని పైపులు విద్యుత్ వైర్లు మంటల్లో కాలిపోయాయని సుమారుగా 20 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు తమ ఆవేదన వ్యక్తపరిచారు. సొసైటీలో బ్యాంకులో అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టామని చేతికి వచ్చే సమయంలో పామాయిల్ తోట పూర్తిగా కాలిపోవడంతో. నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని అడబాల సోమేశ్వరరావు, అడబాల వీర సత్యనారాయణ, అడబాల వీర్రాజు, ప్రభుత్వాన్ని కోరారు. 8 ఎకరాల్లో సుమారుగా 500 పామాయిల్ మొక్కలను వేసామని అన్నారు. దీనిపై రైతులు గోకవరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు నమోదు చేశామన్నారు.

## ఆకలి బాధల నుండి 'అన్నదాత'గా మారా..

### - నాడు ఆకలితో అలమటించా.. నేడు ఉచితంగా అన్నం పెడుతున్నా

### - గోల్డెన్ ఆల్ఫా ఫౌండేషన' వ్యవస్థాపకులు ఆల్ఫా కృష్ణ

**విశాఖపట్నం, మే 26, జయ జయహే :**

ఒకప్పుడు రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఆకలి బాధలను చూసిన వ్యక్తిగా నేడు అనేకమంది పేదల ఆకలి తీర్చే అన్నదాతగా మారానని ప్రముఖ సామాజిక కార్యకర్త, 'గోల్డెన్ ఆల్ఫా ఫౌండేషన' వ్యవస్థాపకులు ఆల్ఫా కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం రోజు 50 మందికి అన్నదానం చేస్తున్నానని, ఈ అన్నదాన ప్రక్రియను జూన్ 1 నుంచి విస్తృతం చేస్తున్నానని చెప్పారు. 2015 మార్చి 21న స్థాపించిన గోల్డెన్ ఆల్ఫా ఫౌండేషన్ ద్వారా పేద, ధనిక అనే తేడా లేకుండా ఆకలితో ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తన జీవిత ప్రయాణాన్ని గుర్తుచేసుకుని ఆల్ఫా కృష్ణ భావోద్వేగానికి లోనయ్యారు. ఆ నాటి ఆకలి.. నేటి




సంకల్పంగా మారిందన్నారు. 1976 నుండి 1982 వరకు తాను స్వయంగా తీవ్రమైన ఆకలి బాధలను అనుభవించానని ఆల్ఫా కృష్ణ తెలిపారు. 1979లో రైల్వే స్టేషన్ దగ్గర ఆకలితో ఉన్న సమయంలో కొందరు ఫుడ్ ప్యాకెట్లు పంచుతుండటం చూసి.. భవిష్యత్తులో నేను కూడా ఇలా పది మందికి అన్నం పెట్టగలనా అని దేవుడిని ప్రార్థించానన్నారు. ఆ సంకల్పమే నేడు గోల్డెన్ ఆల్ఫా ఫౌండేషన్ స్థాపనకు పునాది అని పేర్కొన్నారు.తాను ఈ రోజు ఈ స్థాయిలో ఉండటానికి దేవుడితో పాటు ముగ్గురు వ్యక్తులు కారణమని కృష్ణ చెప్పారు. తనకు జన్మనిచ్చింది దేవుడైతే.. రాజకీయంగా పునర్జన్మను ఇచ్చి, జీవితాన్ని ప్రసాదించిన ఆత్మీయ తండ్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర రెడ్డని కొనియాడారు. అలాగే ఉభయ రాష్ట్రాలలో తనను ఒక నాయకుడిగా గుర్తించి, ఎన్నో సందర్భాల్లో తనకు అండగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని ఎప్పటికీ మరచిపోలేనన్నారు. వైఎస్సార్, జగనన్నల సపోర్ట్ లేకపోతే ఈ రోజు ఆల్ఫా కృష్ణ లేడని ఆయన స్పష్టం చేశారు. విటన్నిటిని స్ఫూర్తి గా తీసుకుని నేడు సమాజ సేవకు అంకితమాయ్యనన్నారు. జూన్ 1 నుంచి తన హోటల్ వద్ద ప్రతీ రోజు 90 మంది అన్నార్థులకు చక్కని భోజనం అందించే ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఇది కొత్తగా జరిగే ప్రక్రియ కాదని ప్రస్తుతం రోజు 50 మందికి అందిస్తున్న ఆహారం ఇకపై 90 మందికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.







## రామాయణ్‌కు హన్స్ జిమ్మర్ సంగీతం

# అదనపు ఆకర్షణ

హిందీలో తెరకెక్కుతున్న ఇతిహాసం 'రామాయణ్'పై సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ అద్భుత కావ్యం ఇండియాకే పరిమితం కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ఆకట్టుకుంటుందని ఏఆర్ రెహమాన్ అన్నారు. దాదాపు 4000 కోట్ల బడ్జెట్‌తో నమిత్ మల్హోత్ర ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ గొప్ప ఇతిహాసం గురించి ప్రపంచానికి తెలియాలన్నదే నిర్మాతగా ఆయన ఆకాంక్ష. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్‌తోపాటు హాలీవుడ్ దిగ్గజ సంగీత దర్శకుడు హన్స్ జిమ్మర్ కూడా పని చేస్తున్నారు.

# నెట్‌ఫ్లిక్స్‌లో ధనుష్ కర

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కర' సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ప్లిక్స అదిరిపోయే వార్త చెప్పింది. థియేటర్లలో సందడి చేసిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే మే 28 నుంచి స్ట్రీమింగ్ ప్రారంభం కానుందనే వార్తలు వినిపించగా.. తాజాగా ఈ మూవీ భాషల విషయంలో కూడా అధికారిక స్పష్టత వచ్చింది. కేవలం తమిళ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులను దృష్టిలో పెట్టుకుని నెట్‌ప్లిక్స్ ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అందుబాటులోకి తీసుకురానుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఈ సినిమాను మే 28 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేయడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.



ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా బాలీవుడ్ నటి ఐశ్వర్యారాయ్ తన ఫ్యాషన్ లుక్ తో కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మెరిశారు. తన కుమార్తె ఆరాధ్యతో కలిసి రెడ్ కార్పెట్‌పై హొయలొలికించారు. అయితే, ఐశ్వర్య లుక్ పై నెట్టింట కొన్ని విమర్శలు ఎదురవుతున్నాయి. వీటిపై ఐష్ స్పందించనప్పటికీ.. నటి కంగనా రనౌత్ ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఐశ్వర్య ఫొటోను తన ఇన్‌స్టాలో షేర్ చేసిన కంగన అద్భుతంగా ఉన్నారని ప్రశంసించారు. 'ఫ్యాషన్, స్టైల్ అనేది ఎవరికి నచ్చినట్లు వారు ఎంపిక చేసుకునేవి. వారి ఇష్టానికి, సౌకర్యానికి తగినట్లు ఉంటాయి. ఈ విషయంలో ఏ మహిళ కూడా ఎవరికీ ఎటువంటి వివరణ ఇచ్చుకోవాల్సిన అవసరం లేదు. కేన్స్‌లో ఐశ్వర్య అద్భుతంగా ఉన్నారు. ఆమెను మరేదైనా స్టైల్‌లో చూడాలనుకునే వారు మొదట

# కేన్ ఫెస్టివల్‌లో మెరిసిన ఐశ్వర్య

మీ దగ్గర ఏముందో ప్రపంచానికి చూపించవచ్చు కదా.. అయినా.. రెడ్‌కార్పెట్‌పై ఎప్పుడూ యువ నటీమణులే ఉండరు. ఇలా 50 ఏళ్లలో ఉన్నవారు కూడా మెరుస్తారు. వారిని చూడడం మీకు అలవాటు లేకపోతే ఇకనైనా అలవాటు చేసుకోండని తన పోస్ట్‌లో కంగనా రాసుకొచ్చారు. ప్రతిష్టాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో మే 12 నుంచి 23 వరకూ సందడిగా జరిగింది. ప్రముఖ డిజైనర్ అమిత్ అగర్వాల్ ప్రత్యేకంగా రూపొందించిన 'లుమినారా' అనే డీప్ సెర్-బ్లూ గౌన్‌లో ఐశ్వర్య రెడ్ కార్పెట్‌పై నడిచి అందరినీ మంత్ర ముగ్ధుల్ని చేశారు. రెండోరోజు వైట్ డ్రెస్‌తో ఫొటోలకు పోజులిచ్చారు.

# లక్కీ ఛార్మ్ త్రిష

## ముగ్గురు హీరోలకు బ్లాక్ బస్టర్లు

సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న త్రిష మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. వరుసగా కోలీవుడ్ స్టార్ హీరోల కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఆమె భాగం కావడం ఇప్పుడు అభిమానుల మధ్య ఆసక్తికర చర్చకు దారితీసింది. దీంతో 'త్రిష లక్కీ ఛార్మ్' అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఇటీవల ఓ అభిమాని సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ విపరీతంగా వైరల్ అయింది. ప్రముఖ హీరోలు అజిత్, విజయ్, సూర్య కెరీర్‌లలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించడాన్ని ప్రస్తావిస్తూ.. 'వారి బ్లాక్ బేస్టర్ విజయాల వెనుక త్రిష మ్యాజిక్ ఉంది' అంటూ రాసుకొచ్చాడు. ఈ పోస్టును త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీతో స్పందించింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ప్రస్తుత తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజరుతో త్రిష నటించిన 'లియో' సినిమా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రం 2023లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ.600 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు తెలిపాయి. విజరు కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఇది నిలిచింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు అధిక రవిచంద్రన్ రూపొందించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో త్రిష కీలక పాత్రలో నటించింది. ఈ సినిమా రూ.248 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి అజిత్ కెరీర్‌లో బిగెస్ట్ హిట్‌గా నిలిచినట్లు ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న సూర్య.. 'కరుప్ప' (తెలుగులో 'వీరభద్రుడు') సినిమాతో మళ్లీ విజయాన్ని అందుకున్నాడు. ఈ చిత్రంలో త్రిష లాయర్ ప్రీతి పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఈ మూడు సినిమాల్లో కూడా త్రిష హీరోయిన్‌గా కనిపించడంతో.. అభిమానులు ఆమెను 'లక్కీ ఛార్మ్' అంటూ ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం త్రిష తెలుగులో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో నటిస్తోంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com